11



గ్యాస్ కట్టర్‌తో కట్‌చేసి
## ఏటీఎంలో చోరీ
- రూ.14లక్షల వరకు చోరీ..
- ఎస్‌బిఐ బ్యాంకులోని సీసీ కెమెరాలకు చిక్కకుండా బ్లాక్ స్ప్రేతో బ్రేక్
- ఆదిలాబాద్ పట్టణంలో ఘటన..

అటుపోతే ఇటురాలేం
## ఇటొస్తే అటుపోలేం

2లో



- తానూర్ మండలం ఝరి(బి) గ్రామస్తుల అవస్థలు
- వాగు ఉప్పొంగితే రెండు రాష్ట్రాలకు రాకపోకలు బంద్
- వాగుపై బ్రిడ్జి లేక ప్రతీ యేటా ప్రమాదాలు


# ప్రభాత సమాచారం
https: epaper.prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ ఆదివారం | 27 జూలై 2025 | ■ 16 పేజీలు




కడెం మండలంలో ఉప్పొంగుతున్న వాగు

10

నాలుగు రోజులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో..
# ఎడతెరిపిలేని వాన

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

- సీఎం ఆదేశాలతో క్షేత్రస్థాయిలోకి అధికారులు..
- భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక అధికారి హరికిరణ్
- అధికారులతో సమీక్ష, పథకాల అమలు తీరుపై ఆరా
- ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..
- ప్రాజెక్టుల నీటి మట్టాన్ని పర్యవేక్షించాలి
- జిల్లాలకు చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- కడెం ప్రాజెక్టులో ఎన్డీఆర్ఎఫ్ బృందం మాక్ డ్రిల్..
- కడెం, కొమురం భీమ్ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత
- నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వర్షం
- కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాలలో ముసురు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వర్షం దంచి కొట్టింది. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో శనివారం తెల్లవారుజాము నుంచి రోజంతా భారీ వర్షాలు పడ్డాయి. కాగా మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ముసురు కురిసింది. వర్షాకాలం ప్రారంభమైన నుంచి ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా భారీ వర్షాలు నమోదయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి దాటిన నుంచి శనివారం ఉదయం మధ్యాహ్నం సాయంత్రం పలుసార్లు ఎడతెరిపించినప్పటికీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈ వానలు ఆదివారం కూడా కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్లపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. కడెం ప్రాజెక్టునకు భారీ వరద వస్తుండ డంతో సాయంత్రం రెండు గేట్లను ఎత్తి వరద నీటిని వాగులోకి వదులు తున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కొమరం భీం ప్రాజెక్ట్ ఒక గేటును ఎత్తి నీటిని వదులుతున్నారు. పలు జలపాతాలు కళకళలాడుతున్నాయి. భారీ వర్షాల కారణంగా ఉన్నత స్థాయి అధికార యంత్రాంగం సర్వత్ర అప్రమత్తం అయింది. ప్రత్యేకంగా నియమించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఐఏఎస్ అధికారి హరికిరణ్ జిల్లాలోనే ఉండి సమీక్షిస్తున్నారు శనివారం మధ్యాహ్నం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ఆయన కడెం ప్రాజెక్టును సందర్శించారు. అక్కడే ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలపై సైతం ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల నీటిమట్టలపై ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద గురించి ఆరా తీశారు. ఉమ్మడి జిల్లాలో ఆస్తి ప్రాణ నష్టం జరగకుండా అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించి జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి జిల్లాలోని పరిస్థితులపై ఆరా తీశారు. మారుమూల, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



మనసును తాకే
సాలేగూడ వాటర్ ఫాల్స్



## ‘సాహో సైనికా’.. కార్గిల్ అమరులకు ఘన నివాళి

- అమర జవాన్ల త్యాగాలను మర్చిపోలేం
- సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి..
- కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరులకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నివాళులు..

కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని సైనిక అమరవీరులకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఘననివాళి అర్పించింది. ఈ విజయం సైనికుల పరాక్రమానికి, దేశ గౌరవానికి చిహ్నమని ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు కొనియాడారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అమరులు, వారి కుటుంబాలకు దేశం రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జోహార్ కార్గిల్ అమరులకు అంటూ నినాదాలు చేశారు. అనంతరం పట్టణంలో కొవ్వొత్తులత ప్రదర్శన నిర్వహించారు.

జెడ్పీటీసీ,ఎంపీటీసీ
## స్థానాలు ఖరారు
- బ్యాలెట్ ద్వారా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- బ్యాలెట్‌లో నోటాకు చోటు
- ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నాహాలు
- హైకోర్టు ఉత్తర్వులతో ఎన్నికల ప్రక్రియ వేగవంతం
- రిజర్వేషన్ల ఏర్పాటుపై దృష్టి..
- జెడ్పీటీసీ బ్యాలెట్ పేపర్ తెలుపు రంగు, ఎంపీటీసీ పేపర్ గులాబీ రంగులో ముద్రించేందుకు ఏర్పాట్లు



## అర్హులందరికీ రేషన్ కార్డులు

16



- లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ
- అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు..
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ప్రతిపక్షల అసత్య ప్రచారం నమ్మవద్దు
- ప్రజల సంక్షేమమే ప్రజాప్రభుత్వ ధ్యేయం
- రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్‌కార్డు మంజూరు అవుతుందని ఖానాపూర్ ఎమ్మెలే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం కడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి అర్హులైన లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని గత ప్రభుత్వంలో రేషన్ కార్డులు మంజూరు చేయడంలో జాప్యం జరిగిందని కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతీ పథకం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తామన్నారు.




## బిక్షాటనకు ప్రత్యేక టైమింగ్స్..
స్మార్ట్‌గా ఆలోచించిన దేశంలోనే మొదటి గ్రామం వాలేగాం



## ఉమ్మడి జిల్లాకు రూ.4 కోట్లు మంజూరు
నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ లేఖకు రాష్ట్ర ప్రభుత్వ స్పందన



అడవి బిడ్డల కోసం
## దేనికైనా సిద్ధం



## విద్యార్థులకు నాణ్యమైన
# భోజనం అందించాలి

- పిల్లలతో కలిసి అల్పాహారం చేసిన కలెక్టర్
- వడ్డించి.. కలిసి భోజనం చేసి...
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, జూలై 26 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, వసతి గృహ పరిసరాలను పరిశీలించి, మెస్ కమిటీ సభ్యులతో రోజువారి ఆహార పట్టిక అమలుపై వివరాలు అడిగి తెలుసుకుని, విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర అన్ని సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించడం జరుగుతుందని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నిత్యవసర సరుకులు వినియోగించాలని, విద్యార్థులకు వేడి భోజనం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థినుల మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సరైన మార్గ నిర్దేశం చేసి వారిలో మనోధైర్యాన్ని కల్పించాలని సంక్షేమ అధికారిని ఆదేశించారు. వసతి గృహ సంక్షేమ అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. వసతి గృహంలో నెలకొన్న నీటి సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకురాగా బోర్ వెల్ మంజూరు చేసి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని సాయికుంటలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలం అయినందున విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు పాటించవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు సిహెచ్. దుర్గాప్రసాద్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం. రవీందర్, వసతి గృహ సంక్షేమ అధికారి డి. చందన సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అటుపోతే ఇటురాలేం - ఇటొస్తే అటుపోలేం





**ముథోల్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

వానాకాలం వచ్చిందంటే ఆ గ్రామస్తులకే తిప్పలే.. ముథోల్ నియోజకవర్గం తానూర్ మండలంలోని ఝరి(బి) గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు ఉధ్రుతంగా ప్రవహిస్తుంది.. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షలతో వాగు పొంగి ప్రవహిస్తోంది. పక్క రాష్ట్రమైన మహారాష్ట్రకు వెళ్లేలంటే ఇక్కడి నుంచే వెళ్లాల్సి ఉంటుంది.. దీంతో వాగు ఉప్పొంగితే అక్కడి వారు ఇక్కడికి.. ఇక్కడి వారు అక్కడి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వర్షం వస్తే మాకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. అసలు బయటికి వెళ్లలేము. వాగు దాటాలంటే చాలా భయంగా ఉంటుంది. ఈ కాలంలో గర్భిణులు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు వాగు దాటే సమయంలో అందులో పడి కొట్టుకుపోతున్నారు. పిల్లలు సరిగ్గా స్కూళ్లకు వెళ్లలేకపోతున్నారు. ప్రభుత్వం మా సమస్యలను పట్టించుకోవాలి. వాగుకు వంతెన నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు అధికంగా కురిసిన సమయంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తాయని, ఆ సమయంలో చాలా భయంగా ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. అత్యవసర సమయాల్లో అదికారులు రావాలన్నా లేని పరిస్థితి అన్నారు. పిల్లలు సరిగ్గా పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లడం లేదన్నారు. వర్షం పడితే వాగుకు అవతలి వ్యక్తులు అటే, ఇక్కడి వాళ్ళ ఇటే అన్నట్లుగా ఉంటుంది. ప్రభుత్వం దృష్టి సారించి రోడ్లు వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వాగు దాటడానికి వంతెనను నిర్మించాలని వేడుకుంటున్నారు.



## ప్రజలకు మెరుగైన
# వైద్యం అందించాలి

### కుమ్రంభీం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**కాగజ్‌నగర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లా గౌడ్ తోటలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జనరల్ వార్డ్, ఎక్స్-రే గది, ప్రయోగశాల వంటి విభాగాలను స్వయంగా పరిశీలించారు. ప్రతి రోజు పరీక్షలకు తీసుకునే నమూనాలు, వాటి నమోదు ప్రక్రియను రిజిస్టర్ల ద్వారా చూశారు. ల్యాబ్ టెక్నీషియన్ల పని తీరు, వాడే పరికరాల పనితీరుపై అధికారులు ప్రశ్నలు అడిగారు. తర్వాత రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది ఎప్పుడు వస్తున్నారు, ఎలా పనిచేస్తున్నారు అనే అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. కొన్ని విషయాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించి సిబ్బందికి తక్షణ సూచనలు ఇచ్చారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ, "ప్రభుత్వ ఆసుపత్రులు పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రధాన ఆశ్రయం. ఇక్కడ చికిత్స నాణ్యంగా, సమయానికి అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. సరైన వసతులు, ఔషధాల లభ్యత, శుభ్రత అంశాల్లో ఎలాంటి అలసత్వం సహించేది లేదు" అని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల కూడా వైద్య సిబ్బందిని ప్రత్యేకంగా హెచ్చరిస్తూ, ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. ఇలాంటి తనిఖీలు నిరంతరం నిర్వహిస్తూ, ఆసుపత్రుల పనితీరును పర్యవేక్షిస్తామని అధికారులు స్పష్టం చేశారు. రోగులకు మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని హితవు పలికారు.

## నూతన ఏపీఎంగా లలిత కుమారి

**జన్నారం, జూలై 26 (ప్రభాత సమాచారం)**



జన్నారం మండల ఐకెపి నూతన ఏపీఎంగా లలిత కుమారి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జన్నారం ఐకెపి ఏపీఎంగా పనిచేస్తున్న బుచ్చయ్య జిల్లా కలెక్టరేట్ కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మందమర్రి మండల ఐకేపీ ఏపీఎంగా పనిచేస్తున్న లలిత కుమారి జన్నారం ఏపీఎంగా నియమితులయ్యారు. రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**పెంబి, జూలై 26 (ప్రభాత సమాచారం)**



నూతన రేషన్ కార్డుల పంపిణీతో ప్రభుత్వ పథకాలు అన్ని పేదలందరికీ మరింత మెరుగ్గా అందుతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం పెంబి మండలంలోని రైతువేదికలో పలువురు అర్హులకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి హరికిరణ్, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్‌తో కలిసి నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన రేషన్ కార్డులతో పేదలకు ఎంతగానో లాభం కలుగుతుందని తెలిపారు. నూతన రేషన్ కార్డుల జారీ, కార్డుల్లో మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, పేదలకు అందరికి సన్న బియ్యం అందించాలన్న ఉద్దేశ్యంతో నూతన రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వ శ్రీకారం చుట్టింది అని చెప్పారు. పేదలందరికీ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. ఈ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే ఊరుకునేది లేదు : ఎమ్మెల్యే రామారావు పటేల్

**ముథోల్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

అభివృద్ధి విషయంలో ఆటంకం కలిగిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని, రాని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శనివారం సిరాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయలే తప్ప, అభివృద్ధి విషయంలో అందరు కలిసికట్టుగా ఉండాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇండ్లు ఇప్పిస్తానని, పేదలకు అన్యాయం చేస్తానంటే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. అభివృద్ధి విషయంలో అడ్డంకులు సృష్టించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# ప్రాణరక్షణే లక్ష్యం

- ప్రజల సన్నద్ధతకే కడెం ప్రాజెక్టులో మాక్‌డ్రిల్
- విపత్కర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు
- ఎన్డీఆర్ఎఫ్ బృందం సిద్ధంగా ఉండాలి
- అత్యవసర, సమయంలో అప్రమత్తంగా ఉండాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





కడెం, జూలై 26 (ప్రభాత సమాచారం)
విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అన్ని సమయాల్లో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం కడెం ప్రాజెక్టు వద్ద నిర్వహించిన మాక్‌డ్రిల్‌ను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ ప్రత్యేక అధికారి హరికిరణ్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం చేపట్టిన రక్షణ విన్యాసాలను పరిశీలించిన అనంతరం బోటులో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల వల్ల వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో లోతట్టు గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భయపడాల్సిన అవసరం లేదని విపత్కర పరిస్థితుల్లో స్పందించేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందం సిద్ధంగా ఉందని కలెక్టర్ వివరించారు. ప్రాజెక్టు గేట్లు, నీటి మట్టం, ఇన్‌ఫ్లో తదితర అంశాలపై అధికారులను అడిగి తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు, యుద్ధ వాతావరణ సమయంలో పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, సివిల్ డిఫెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర శాఖలు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపడతాయని చెప్పారు. అత్యవసర సమయాల్లో 15 నిమిషాల కంటే ఎక్కువ సమయం సైరన్ మోగితే పరిస్థితిలో తీవ్రత ఉందని గ్రహించాలని, అందుకు తగిన విధంగా సురక్షిత చర్యలు తీసుకోవడంతోపాటు అధికార యంత్రాంగంతో సహకరించాలని కలెక్టర్ తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులు అధిక వరద ప్రవాహానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ అమర్ ప్రతాప్ సింగ్, ఎక్సైజ్ అధికారి ఎం.ఎ. రజాక్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, ప్రజలు పాల్గొన్నారు.



## కార్గిల్ అమరులకు
# నివాళులర్పించిన కలెక్టర్

ఆదిలాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)
కార్గిల్ యుద్ధం భారత సైనికుల ధైర్యం, దేశభక్తికి అద్దం పడుతుందని, వారి త్యాగాల వల్లనే మనం నేడు ప్రశాంతంగా జీవించగలుగుతున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని కార్గిల్ పార్క్‌లో శనివారం కార్గిల్ విజయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాజీ సైనికులు, ఎన్.సి.సి క్యాడెట్లు, స్థానిక ప్రజలతో కలిసి కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమర జవాన్ లకు అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఆపరేషన్ విజయ్ పేరిట కార్గిల్ నుంచి యుద్ధభేరి మోగించి కార్గిల్ కొండల నుంచి శత్రుమూకలను తరిమికొట్టిన సందర్భంగా ప్రతీయేటా జులై 26న కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహిస్తున్నామని నేటితో కార్గిల్ విజయ్ దివస్‌కు సరిగ్గా 26 ఏళ్లు నిండాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, మున్సిపల్ కమిషనర్ సీవియన్ రాజు, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శంకర్ దాస్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

# జీవో 49 రద్దు చేసే వరకు పోరాటం



కాగజ్‌నగర్, జూలై 26 (ప్రభాత సమాచారం)
ఫారెస్ట్ కన్జర్వేషన్ ఏర్పాటుకు జారీ చేసిన జీవో 49 ను తాత్కాలిక నిలుపుదల కాకుండా శాశ్వతంగా రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ డిమాండ్ చేశారు. శనివారం కాగజ్‌నగర్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 339 గ్రామాలు, మూడు లక్షల 65 వేల ఎకరాల పంట భూములు, నీటి వనరులు, నివాసాలు, హక్కులను కోల్పోతుండడంతో ప్రజలు చేసిన పోరాటానికి ప్రభుత్వం జీవోను తాత్కాలికంగా నిలుపుదల చేయడం సిపిఎం స్వాగతిస్తుందని అన్నారు. జీవో పూర్తిస్థాయి రద్దు కోసం ఈనెల 28 కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని ఆదివాసీలు దళితులు కార్మికులు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రాజన్న, నియోజకవర్గం కన్వీనర్ ఆనంద్ కుమార్, కమిటీ సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాగజ్‌నగర్, జూలై 26 (ప్రభాత సమాచారం)
నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కాగజ్ నగర్ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను శనివారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శక్లా తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ల గుణనాత్మకత, ధరల నియంత్రణ, లైసెన్స్ నిబంధనల మేరకు రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరా చేసే విధానంపై పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతుల నుండి ఏవైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల హితాలను కాపాడటం మా ప్రధాన ప్రాధాన్యత. ఫర్టిలైజర్ డీలర్లు నాణ్యత, న్యాయమైన ధరలను నిర్ధారించాలి" అని పేర్కొన్నారు. అన్ని షాపులు నియమాలను పాటిస్తున్నాయో లేదో నిరంతరం మానిటరింగ్ చేయడం జరుగుతున్నదని తెలిపారు. సబ్ కలెక్టర్ శ్రద్ధా శక్లా ఫర్టిలైజర్ షాపుల్లో స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్లు ,లైసెన్స్ దస్తావేజులను పరిశీలించారు. ఏ షాపులోనైనా నియమాల ఉల్లంఘన కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హెచ్చరించారు.



## సీఆర్‌టీ పరీక్షలను
# పకడ్బందీగా నిర్వహించాలి

### అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)
సి.ఆర్.టి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పరీక్షల ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు, పరిశీలకులు, సెట్టింగ్ స్క్వాడ్, రూట్ అధికారులు, ఇన్విజిలేటర్లతో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలలో ఒప్పంద ప్రాతపదికన కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సి.ఆర్.టి.) పోస్టులకు నిర్వహించే పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... సి. ఆర్. టి. పరీక్షల కొరకు జిల్లా కేంద్రంలో 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష ఉంటుందని, సుమారు 1 వేయి 137 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య పరీక్షా కేంద్రాలకు తరలించడం జరుగుతుందని, పరీక్షల నిర్వహణ కొరకు విధులు కేటాయించిన అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ చేతి గడియారాలు, సెల్ ఫోన్ లకు పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉండదని, పరీక్ష కేంద్రంలో ఫర్నిచర్, వెలుతురు, ఫ్యాన్లు సౌకర్యాలు కల్పించాలని, త్రాగునీరు, పారిశుధ్యం పకడ్బందీగా చేపట్టాలని, వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. విద్యుత్ కోత లేకుండా చూడాలని, పరీక్ష సమయానికి అను గుణంగా ఆర్‌టిసి అధికారులు బస్సులు నడిపించాలని, పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు కల్పించాలని తెలిపారు. పరీక్షా నిర్వహణలో ఎలాంటి కోపం జరగకుండా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ఇంచార్జ్ విద్యాధికారి ఉదయ్ బాబు, మున్సిపల్ కమిషనర్ గజానన్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి



### తెలంగాణ తల్లి విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన

మంచిర్యాల, జూలై 26 (ప్రభాత సమాచారం)
పార్లమెంట్ సమావేశంలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల తెలంగాణ తల్లి విగ్రహానికి శనివారం వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న 36 పార్టీల నుంచి 32 పార్టీలు బిసి రిజర్వేషన్ బిల్లుకు అనుకూలంగా ఉన్నాయనీ, దేశంలోని తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినప్పటికీ బీసీ రిజర్వేషన్ బిల్లు ఎందుకు ప్రవేశ పెట్టడం లేదో బీసీ సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో 10 శాతం లేని అగ్రకులాలే దేశాన్ని, రాష్ట్రాన్ని 78 సంవత్సరాలుగా పాలిస్తున్నారనీ, 60 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం అందని ద్రాక్షగా మారిందనీ, ఇదేనా ప్రజాస్వామ్యం, ఇదేనా సామాజిక న్యాయం అని వారు ప్రశ్నించారు. రాజ్యాంగం చెప్తుంటే ఈ అగ్రకులాలు బీసీలకు చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించడంలో పూర్తిగా నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు
# ప్రయోగాత్మక విద్యను అందించాలి

**కడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**కడెం, జూలై 26 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంపై దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం కడెం మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, స్టోర్ రూమ్, వంటగది వంటి ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. సందర్శనలో భాగంగా కలెక్టర్ స్వయంగా ఏడవ తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్రంలోని దర్పణాలు పాఠాన్ని బోధించి, పటాలు గీయించారు. విద్యార్థుల దగ్గరుండి జవాబులు తెలుసుకున్నారు. తద్వారా సృజనాత్మకత పెరిగేందుకు ప్రయోగాత్మక విద్య ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతిరోజూ అన్ని తరగతుల్లో కనీసం 15 నిమిషాల పాటు చదవడం నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే, కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫార్ములు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 10వతరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ సిలబస్ ప్రగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోర్డు పరీక్షలకు లక్ష్యంగా ఇప్పటి నుంచే చదువులకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, ఇతర వసతులపై విద్యార్థులే స్పందించేలా ప్రశ్నలు అడిగారు. పాఠశాల పరి



సరాలను శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. తనిఖీలో ఎంపీడీవో అరుణ ఉన్నారు.

## నాణ్యమైన విద్య అందించాలి

**- ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలి**
**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జూలై 26 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలనీ కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని సాయికుంటలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో అకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థినుల హాజరు, వసతి, ఆహారం, శౌచాలయాల పరిస్థితి, శుభ్రత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందుతున్నాయా! లేదా! అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల తరగతి గదులను కలెక్టర్ కుమార్ దీపక్ తిరిగి పరిశీలించారు. పిల్లలతో స్వయంగా మాట్లాడుతూ పాఠ్యాంశాలలోని ప్రశ్నలు అడిగి పిల్లల సామర్థ్యాలను పరీక్షించారు.



## కోలూర్ పొలాల్లో చిరుత పాదముద్రలు



**ముథోల్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా తానూర్ మండలం కోలూర్ గ్రామ శివారులోని పొలంలో చిరుత పులి పాదముద్రలు కనిపించినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వాగ్మారే లక్ష్మణ్ తన పంటచేలవైపు వెళ్లే మార్గంలో చిరుత పాదముద్రలు కనిపించాయని తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పాదముద్రలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చి, తాను తీసిన వీడియోను వారికి పంపారు. వీడియోను పరిశీలించిన అధికారులు అవి చిరుత పాదముద్రలేనని ధృవీకరించి, ప్రస్తుతం ఘటనాస్థలికి వెళ్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో చిరుత సంచరిస్తోందన్న అనుమానంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

## కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**బెల్లంపల్లి రూరల్ సిఐ హనోక్**

**బెల్లంపల్లి, జూలై 26 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని బెల్లంపల్లి రూరల్ సీఐ హెచ్ హనోక్ అన్నారు. నెన్నెల్ మండలం కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు ఉన్నతమైన ఆశయాలను ఏర్పాటు చేసుకొని పట్టుదలతో కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకొవాలన్నారు. తల్లితండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని ఉద్బోధించారు. ఎలాంటి చెడు ఆకర్షణలకులోను కాకుండా చదువుపైనే శ్రద్ధ పెట్టాలన్నారు. పోలీసులు ఎల్లవేళల అందుబాటులో ఉంటారనీ, ఎలాంటి సమస్య ఉన్న పోలీసులకు



చెప్పవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెన్నెల ఎస్ఐ కె ప్రసాద్, కస్తూర్బా స్కూల్ ప్రిన్సిపల్ పి కవిత, కానిస్టేబుల్ అనంతరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సైనికుల త్యాగాలకు
## ప్రతిబింబం 'కార్గిల్ దివస్'

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, జూలై 26 (ప్రభాత సమాచారం)**

సైనికుల త్యాగాలకు ప్రతిబింబం "కార్గిల్ దివస్" అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సైనికులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్గిల్ దివస్ కార్యక్రమాన్ని కార్మికుల త్యాగాలకు ప్రతిబింబమని, భావితరాలకు తెలిసే విధంగా జరుపుకుంటున్నామని తెలిపారు. 1999 లో నావీ, ఎయిర్ ఫోర్స్, ఆర్మీ సమిష్టిగా పోరాడి మన దేశ సరిహద్దులను కాపాడారని, ఆ సమయంలో పోరాడి అమరులైన సైనికుల త్యాగాలను స్మరించుకోవాలని తెలిపారు. భారత దేశాన్ని సరిహద్దులలో సైనికులు 365 రోజులు 24 గంటలు ప్రతి క్షణం కంటికి రెప్పలా కాపాడుతున్నారని, దేశ ప్రజల రక్షణ కోసం అందరినీ వదిలి దేశ సేవలో ఉన్నారని తెలిపారు. నిరంతరం విధులు నిర్వహిస్తున్న సైనికులకు గౌరవంగా కార్గిల్ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని తెలిపారు. మాజీ సైనికులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పోలీస్ అధికారులు, ఎన్.సి.సి. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# దేశవ్యాప్త ఆందోళనను సింగరేణిలో జయప్రదం చేయాలి

**బిఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సత్తయ్య**

**మంచిర్యాల, జూలై 26 (ప్రభాత సమాచారం)**

బొగ్గు పరిశ్రమ పరిరక్షణ, కార్మిక హక్కుల సంరక్షణ లక్ష్యంగా చేపట్టిన దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాలు, ఉద్యమాలలో సింగరేణి కార్మికులు భాగస్వామ్యం కావాలని బిఎంఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి సత్తయ్య అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిపై సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) ద్వార సమావేశంలో ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణితో కలిసి మాట్లాడారు. సింగరేణిలో గతంలో 1.3 లక్షల ఉద్యోగులతో 30 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగిందని, ప్రస్తుతం 39 వేల ఉద్యోగులతో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరుగుతోందని, కోల్ ఇండియాలో 6.5 లక్షల ఉద్యోగులు ఉండగా, ప్రస్తుతం 2 లక్షల ఉద్యోగులతో 800 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేస్తున్నారన్నారు. ఉత్పత్తిలో పెరుగుదల గణనీయంగా పెరిగిం దని, ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిందన్నారు. శాశ్వత ఉద్యోగుల సంఖ్య తగ్గుతూ, తక్కువ వేతనం, భద్రత లేని పరిస్థితుల్లో



కాంట్రాక్ట్ కార్మికులను వినియోగిస్తున్నారని, వారికి కనీస వేతనాలు, సురక్షిత పని వాతావరణం, వైద్య సదుపాయాలు, నివాస క్వార్టర్లు లేవన్నారు.

**12 ఏండ్లులుగా సవరణ లేదు...**

రాష్ట్రంలో 12 సంవత్సరాలుగా కనీస వేతన సవరణ జరగలేదని బిఎంఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి సత్తయ్య అన్నారు. సింగరేణిలో కోల్ ఇండియా మాదిరిగా హై పవర్ కమిటీ వేతనాలు ఇప్పటికీ అమలు కాలేదని, వెంటనే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో రాజకీయ జోక్యం విచ్చలవిడిగా పెరిగిందని, సంస్థలు పరిపాలన విభాగం గాడి తప్పిందని విమర్శించారు.

**ట్రాన్స్‌కో, జెన్‌కోల నుంచి బకాయిలు...**

ట్రాన్స్‌కో, జెన్‌కోల బకాయలు గత ప్రభుత్వ హయాంలో రూ. 26 వేల కోట్లు ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం హయాంలో ఆమొత్తం రూ. 39,661.57 కోట్లకి పెరిగిందని, ఇప్పటికైనా విద్యుత్ బొగ్గు బకాయలు చెల్లించుటకు చర్యలు తీసుకోవాలని బిఎంఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. బొగ్గు బకాయిలు రూ. 14,743.25 కోట్లు, విద్యుత్ బకాయిలు రూ. 24,918.32 కోట్లు చెల్లింపులకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బిఎంఎస్) శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సెంట్రల్ సెక్రెటరీ మాదాసు రవీందర్, సెంట్రల్ ట్రెజరర్ హరి, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి రాజేందర్, ట్రెజరర్ గూడ శ్రీకాంత్, జాయింట్ సెక్రెటరీ మేకల స్వామి, కట్కూరి సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోళ్ళ మహేందర్, ఆర్కే 5 ఫిట్ సెక్రెటరీ రామకృష్ణ, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ చంద్రశేఖర్, టి కిరణ్ కుమార్, కుంట రాజు, పాగిడి శ్రీకాంత్, చల్ల ప్రశాంత్, అరుణ్ పాల్గొన్నారు.

# తాగునీటి కోసం జాతీయ రహదారిపై రాస్తా రోకో



## ఖాళీ బిందెలతో వర్షంలో నిరసన

ముథోల్, జూలై 26 (ప్రభాత సమాచారం)

ముథోల్ మండలంలోని తరోడ గ్రామంలో తాగునీటి కోసం కాలనీవాసులు ఖాళీ బిందెలతో వర్షంలో శనివారం జాతీయ రహదారి పై రాస్తారోకో చేశారు. తమ ఎస్సీ కాలనీలో గత పది రోజులుగా తాగు నీరు రావడం లేదని కాలనీ వాసులు పలుమార్లు గ్రామ పంచాయతీ సిబ్బందికి దృష్టికి తీసుక వచ్చినా పట్టించుకోకపోవడంతో స్థానిక భైంసా, బాసర జాతీయ రహదారి పై రాస్తారోకో చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. తమ కాలనీలోని బోరు బావి చెడిపోయి రోజులు గడుస్తున్నా.. ఎవరూ పట్టించుకోవటం లేదని కాలనీ వాసులు ఆరోపించారు. తక్షణమే బోరు బావికి మరమ్మతులు చేయించి, తాగు నీటిని అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ముథోల్ పోలీస్ సంఘ టన స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో పోలీసులు మాట్లాడారు. త్రాగు నీటి సమస్య పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులకు తెలియజేస్తామని వారు తెలిపారు. దీంతో కాలనీ వాసులు రాస్తారోకోను విరమించారు. రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయిన వాహనాల రాకపోకలను పోలీసులు క్లియర్ చేశారు.





## చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నిర్మల్, జూలై 26 (ప్రభాత సమాచారం)

నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్, సొన్, మామడ, లక్ష్మణచందా, సారంగాపూర్, దిలవార్‌పూర్, నర్సాపూర్ మండలాలకు చెందిన 52 మంది లబ్ధిదారులకు రూ.12,50,000/- చెక్కులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు.

## సైనికులకు దేశం రుణపడి ఉంటుంది



వాంకిడి, జూలై 26 (ప్రభాత సమాచారం)

వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో 26వ కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్ శనివారం పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన వీర జవాన్లకు ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం కార్గిల్ విజయ్ దివస్ ని పురస్కరించుకొని జేత్వాన్ బుద్ధ విహార్ దేశ సైనికుల విజయ గాథలపై భజన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు శ్యాం రావు, దుర్గే పాల్గొన్నారు.

## ఫలితాల సాధనకు కృషి చేయాలి



ఆదిలాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)

రాబోయే ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలని ఆదిలాబాద్ ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్ కుమార్ సూచించారు. శనివారం ఉట్నూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులతో సమావేశం విద్యార్థులకు మంచిగా విద్య బోధన చేయాలని అధ్యాపకులకు ఆయన సూచించారు.

### కార్గిల్ అమరులకు ఆర్ట్స్ కళాశాల

## ఎన్‌సీసీ క్యాడెట్ల నివాళులు

ఆదిలాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల ఎన్సిసి క్యాడేట్లు కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించి అక్కడి నుండి నినాదాలతో ర్యాలీగా బయలుదేరి మునిసిపల్ కార్యాలయం ఆవరణలో గల అమరవీరుల స్థూపం వద్ద శనివారం పుష్ప గుచ్చాలతో అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ అరవింద్ కిచెర్, బెటాలియన్ స్టాఫ్ భగీరథ రామ్, కవాల్జిత్ సింగ్, నరేష్, ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం, వైస్ ప్రిన్సిపల్ రఘు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.




## ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



నిర్మల్, జూలై 26 (ప్రభాత సమాచారం)

పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల సోమవారపేట్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు శనివార ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి మొదటగా 9వ తరగతిలో కూర్చొని, ఆంగ్ల ఉపాధ్యాయుడు బోధిస్తున్న పాఠాన్ని విన్నారు. టీచింగ్ డైరీ, లెసన్ ప్లాన్, యూనిట్ ప్లాన్ తదితర వాటి గురించి ఉపాధ్యాయుడిని అడిగి వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో వివిధ అంగ్ల పదాల స్పెల్లింగ్లను బోర్డుపై వ్రాయించి, వారి ప్రగతిని తెలుసుకున్నారు. ఆంగ్ల ఉపాధ్యాయుడి బోధిస్తున్న తీరును, బోధనా పద్ధతులను, వాడిన టిఎల్ఎంల వివరాలను తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ లో నమోదు చేశారు. విద్యార్థుల ప్రగతిని, పాఠశాల సమగ్ర వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారికి వివరించారు.

## బురదమయమైన పావులపాలెం రోడ్డు



కాసిపేట, జూలై 26 (ప్రభాత సమాచారం)

కాసిపేట మండలం దేవాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దాపూర్ పావులగూడెంకు వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి మొత్తం బురదమయంగా మారింది. దీంతో గిరిజనులు రాకపోకలు సాగించటానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. టీవల రోడ్డుపై వేసిన మొరంతో బురదగా మారి కనీసం నడవలేని పరిస్థితికి చేరుకున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీ కోలాం పీవీటీజీ గ్రామాలను అధికారులు పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. గతంలో కనీసం నడవడానికైనా రోడ్డు ఉండేదని, ఆ రోడ్డుపై మొరం బదులు బురద మట్టి వేసి రోడ్డును నాశనం చేశారని నిరసన తెలిపారు. వెంటనే తమకు రోడ్డు వేయాలని కోలాం సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం మహేష్ కోరారు.

## విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



ఆదిలాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)

వర్షాకాలం నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో విష జ్వరాలు ప్రబలకుండా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని మాస్ లైన్ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగన్ సింగ్ అన్నారు. శనివారం అదిలాబాద్ రూరల్ మండలం ఆర్లి (బి) గ్రామ పంచాయతీ శివారులో నివసిస్తున్న నిశాన్ఘాట్ గ్రామాన్ని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మడవి రేణుక తదితరులతో కలిసి ఆయాన సందర్శించారు. ఈ సందర్భంగా జగన్ సింగ్ మాట్లాడుతూ విష జ్వరాలతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వ వైద్యాధికారులు తక్షణమే గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శిలు పారిశుద్ధ పనులను ఎప్పటికప్పుడు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన కోరారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతాల్లో విష జ్వరాలను బారిన పడి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



## కేసుల పరిష్కారానికి చర్యలు

### కేసుల పురోగతి, కోర్టు పనితీరుపై జిల్లా జడ్జి, ఎస్పీ సమీక్షా సమావేశం

నిర్మల్, జూలై 26 (ప్రభాత సమాచారం)

నిర్మల్ జిల్లా న్యాయ మండలిలో జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీవాణి అధ్యక్షతన జిల్లా ఎస్పీ జానకి షర్మిల సమక్షంలో కేసుల పురోగతిపై సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి, పోలీసు అధికారులకు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేస్తూ, పెండింగ్‌లో ఉన్న కేసులు, వారెంట్ల అమలు, చార్జ్‌షీట్లు దాఖలు వంటి అంశాలపై విపులంగా చర్చ జరిగింది. కేసుల విచారణలను వేగవంతం చేయాలని, సకాలంలో చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని, న్యాయ ప్రక్రియలు ఆలస్యంకాకుండా చూడాలని, సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా న్యాయమూర్తి శ్రీవాణి, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ తో పాటు జిల్లా సబ్ జడ్జి శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాధిక, ఆర్‌డిఓ రత్న కల్యాణి, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన, ఇన్స్పెక్టర్లు పఎస్ఐలు, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్స్,ఇతర కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించని

## హాస్టళ్లపై చర్య తీసుకోవాలి

నిర్మల్, జూలై 26 (ప్రభాత సమాచారం)

నిర్మల్ జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ హాస్టల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని వాటిపై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్ డిమాండ్ చేశారు. హాస్టల్లో సీట్లు లభించని పేద విద్యార్థులు ప్రైవేటు హాస్టల్లో సంప్రదిస్తుండగా అధిక ఫీజులు వసూలు చేసి నాణ్యమైన భోజనం అందించకుండా చార్జీల పేరుతో డబ్బులు సంపాదిస్తున్నారని చర్య తీసుకోవాలన్నారు.



# జిల్లాలో నేరాల నియంత్రణకు కృషి చేయాలి

## నేర సమీక్షా సమావేశంలో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)
నేరాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వాటిని అదుపు చేయడానికి మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షించారు. నేరాల నియంత్రించడానికి తీసుకుంటున్న చర్యలు, పెండింగులో ఉన్న కేసుల వివరాలు, కేసుల పరిష్కారానికి అధికారులు చూపిస్తున్న చొరవ, నేరాలకు పాల్పడిన నేరస్తులకు కోర్టులో శిక్షలు పడే విధంగా తీసుకుంటున్న ముందస్తు చర్యలను ఎస్పీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజా అవసరాలకు అనుగుణంగా పోలీసు శాఖ పారదర్శకంగా సేవలందిస్తూ ప్రజా మన్ననలు పొందేలా ముందుకు సాగాలన్నారు. పెరిగిపోతున్న వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నియంత్రణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటూ శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేకుండా పని చేయాలన్నారు. ముఖ్యంగా నిఘా వ్యవస్థకు ప్రధాన సంపత్తిగా మారిన సిసిటీవీల వల్ల భద్రతా ప్రమాణాలు పెరుగుతున్న క్రమంలో నేను సైతం, కమ్యూనిటీ పోలీసింగ్ లో సిసి కెమెరాల ఏర్పాటును మరింత ప్రోత్సహించే విధంగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. నేరం చేసే వాడికి శిక్ష పడాలి, నేరం చేయని వారికి రక్షణగా ఉంటూ, సమర్థ సేవలు ప్రజలకు అందాలన్న సంకల్పంతో పోలీస్ శాఖ లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. అదే విధంగా మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలు అందించాన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్, కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ సీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం



అవసరమైన అన్ని రకాల రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించడం, రద్దీ గల ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు సంబంధిత శాఖలు, ప్రజలను సమన్వయం చేస్తూ వాటిని అధిగమించేలా ముందుకు సాగాలన్నారు. జిల్లాలో దొంగతనాలు నివారణకు రాత్రి, పగలు పెట్రోలింగ్ నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నాకాబంది, కార్డెన్ అండ్ సెర్చ్, వాహన తనిఖీ లాంటి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలని అన్నారు. రౌడీ షీట్స్, సస్పెక్ట్స్, పాత నేరస్థులపై నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థతో ప్రజలు పోలీస్ వ్యవస్థ యొక్క సేవలను వినియోగించుకునేలా, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికై కృషి చేయాలని అన్నారు. సైబర్ నేరాల ఆన్ లైన్ బెట్టింగ్, లోన్‌యాప్‌ల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యక్రమాలు అక్రమ గంజాయి, జూదం, పీడీఎస్ బియ్యం, అక్రమ ఇసుక రవాణా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. కఈ సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజన్, డిసిఆర్బి డిఎస్పి విష్ణుమూర్తి, సీఐలు, ఆర్.ఐ లు, యస్.ఐ లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎరువుల దుకాణాల తనిఖీ

### నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు

కాసిపేట, జూలై 26 (ప్రభాత సమాచారం)
మండలంలోని ఎరువుల దుకాణాలను మండల స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని ముత్యంపల్లి, కాసిపేట, కోమటిచెను, దేవాపూర్ గ్రామాలలోని ఎరువుల దుకాణాలను సందర్శించి ఎరువుల పంపిణీనీ, స్టాక్ రిజిస్టర్, బిల్ల్ ఇతర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సీహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ ఎరువుల దుకాణాల వద్ద స్టాక్ బోర్డ్ ఏర్పాటు చేసి స్టాక్ వివరాలు, ధర వివరాలు తెలియాజేయాలని, రైతులు యూరియా అడిగితే ఇతర ఎరువులు లింక్ పెట్టి ఇవ్వరాదని, డీలర్స్ ఎట్టి పరిస్థితుల్లో యూరియా, ఇతర ఎరువులను అధిక ధరలకు అమ్మవద్దని, అమ్మినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా, ఇతర ఎరువులను బ్లాక్ చేయవద్దని, యూరియాను అనధికార చర్యలకు వినియోగించవద్దన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపిటీసీ

బెల్లంపల్లి, జూలై 26 (ప్రభాత సమాచారం)
కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన మరమల మంగయ్య మాజీ ఎంపీటీసీ శనివారం కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గ మరియు మండల నాయకులు మంగయ్యకు బిఆర్ఎస్ కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నారని మంగయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.



## నిర్మల్ పట్టణంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం



నిర్మల్, జూలై 26 (ప్రభాత సమాచారం)
జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు శనివారం నిర్మల్ పట్టణంలోని మహాలక్ష్మి వాడ, డబుల్ బెడ్‌రూమ్స్ ప్రాంతంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. అనుమతులు లేకుండా నడుపుతున్న(70) ద్విచక్రవాహనాలు,(03)ఆటోమొబైల్ వాహనాలు స్వాధీనం చేసుకొని, సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా మాట్లాడుతూ సైబర్ నేరాలు, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, మద్యం సేవనం, మైనర్ల చేత వాహనాల నడపడం వంటి వాటికిత దూరంగాత ఉండాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అలాగే ఆస్తి సంబంధ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆయన అన్నారు.

## గ్రీన్ ఇండియా మిషన్‌లో భాగంగా మొక్కలు నాటిన విద్యార్థులు

మంచిర్యాల, జూలై 26 (ప్రభాత సమాచారం)
స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా శ్రీ చైతన్య పాఠశాల లక్ష్మీనగర్ బ్రాంచ్ విద్యార్థులు గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజనల్ మేనేజర్ సదాశివరెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు మొక్కలు నాటడమే కాకుండా వాటిని రక్షించే బాధ్యత తీసుకోవాలని, క్రమం తప్పకుండా మొక్కలకు నీరు పోసి రక్షించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో మొక్కలను పెంచి రక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి నెలా ఒక సామాజిక కార్యక్రమాన్ని చేపట్టడం, విద్యార్థులలో సామాజిక సేవా భావాన్నిపెంపొందించడం కోసం అవేర్నెస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇవి మా పాఠశాల పాఠ్య ప్రణాళికలో ఒక భాగమన్నారు. అనంతరం విద్యార్థులు, యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) అరవింద్ రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.





## అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం

ముథోల్, జూలై 26 (ప్రభాత సమాచారం)
అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శనివారం లోకేశ్వరం మండలంలోని పుస్పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం లబ్దిదారులకు ప్రొసీడింగ్ కాపీ ఇచ్చి మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుపేదలకు, ఆర్థికంగా వెనుకబడినవర్గాల వారికి పక్కా ఇల్లు నిర్మించుకోవడానికి ఆర్థిక సహాయం అందించడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సొంత ఇల్లు లేని పేదలందరికీ గృహవసతి కల్పించడం సొంత స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల ఆర్థిక సహాయం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తాయని తెలిపారు. కుటుంబానికి సొంత ఇల్లు లేనివారికి గుడిసెలలో తాత్కాలిక ఇళ్లలో నివసించే వారికి ప్రాధాన్యత ఇస్తాన్నారు.

## సిఆర్‌టి పరీక్ష నిర్వహణకు చర్యలు

### తహసిల్దార్ బి. ప్రవీణ్ కుమార్

ఉట్నూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)
ఈ నెల 27వ తేదీన జరుగనున్న తెలంగాణ సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల పరీక్షకు పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరిగిందని ఉట్నూర్ మండల తహసిల్దార్ బి. ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025- 26 సంవత్సరానికి గాను తెలంగాణ సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల పోస్టుల భర్తీ కొరకు ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష సమయంలో చట్ట విరుద్ధ కార్యకలాపాలు నిరోధించడానికి, శాంతిభద్రతల పరిరక్షణకు 163 బి.ఎన్.ఎస్.ఎస్. ను సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని కె. బి. కాంప్లెక్స్ వద్ద 5 గురు అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు సమూహంగా కనిపించినా, అనధికార ఊరేగింపులు, చట్ట విరుద్ధ సమావేశాలు నిర్వహించినా, కర్రలు, ఇటుకలు, రాళ్ళు, గొలుసులు, ఇతర ఆయుధాలు కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించేందుకు ప్రమాదకర ప్రదేశాలలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## న్యాయం చేయాలంటూ మృతదేహంతో ఆందోళన



రామకృష్ణాపూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)
తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో సుమారు 17 గంటల పాటు ఆందోళన చేపట్టిన సంఘటన రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణానికి చెందిన లావణ్య అదే పట్టణానికి చెందిన ముద్దసాని సురేష్ అనే సింగరేణి కార్మికునితో గతంలో వివాహం జరిగింది. కొద్ది రోజుల కిందట పెద్దపల్లిలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడిన లావణ్య అపస్మారక స్థితిలో ఉండి మృతి చెందింది. కాగా లావణ్య కుటుంబ సభ్యులు సురేష్ నుంచి రావలసిన కట్నం డబ్బులు, బంగారం తమకు తిరిగి ఇవ్వాలని శుక్రవారం రాత్రి మృతదేహంతో సురేష్ ఇంటికి వెళ్లే క్రమంలో విషయం తెలుసుకున్న పోలీసులు పట్టణంలో ఎలాంటి గొడవలు జరుగకుండా ఏరియా ఆసుపత్రి వద్ద లావణ్య కుటుంబ సభ్యులను అడ్డుకున్నారు. మృతదేహంతో ఏరియా ఆసుపత్రి వద్ద తమకు రావాల్సిన కట్నం డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని శనివారం ఆందోళనకు దిగారు.



## ఎరువులు పక్కదారి
# పట్టిస్తే కఠిన చర్యలు

**కోటపల్లి, జూలై 26 (ప్రభాత సమాచారం)**

ఎరువులు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి చత్రునాయక్ అన్నారు. శనివారం మండంలోని బబ్బెరచెల్క, పారుపల్లి, ఆల్గామ, జనగామ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను, గోదాములను ఏవో సాయికృ ష్ణరెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. డీలర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా డీలర్లు ఎరువులను అధిక ధరలకు అమ్మినా, అలాగే ఇ తర ప్రొడక్టులను లింక్ చేసి అమ్మినా చర్యలు తీసుకుంటామన్నారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి పట్టాదారు సంబంధిత వ్యవసాయ వి స్తరణ అధికారి వద్ద రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నా రు. అనంతరం కోటపల్లిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో యూరియా పంపిణీని పరిశీలించారు. చెన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బానోత్ ప్రసాద్, మండల వ్యవసాయా ధికారి సాయికృష్ణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, ఏఈవోలు రాజ్ కుమార్, వైష్ణవి, వసుధ, రమ్య రైతులు పాల్గొన్నారు.

## మధ్యాహ్నం భోజన కార్మికుల
# సమస్యలు పరిష్కరించాలి



**ఖానాపూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు, నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌లను మధ్యాహ్న భోజన కార్మికులు కోరారు. శనివారం కడెం మండల కేంద్రంలో వారిని మధ్యాహ్న భోజన కార్మికులు కలిసి వినతి పత్రం సమర్పించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. పది వేల కనీస వేతనం ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధా, తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల వద్ద బందో బస్తు

**ఆసిఫాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే లైసెన్స్ సర్వేయర్స్, గ్రామ పాలన ఆఫీసర్స్(జీపీవో), సీఆర్టీ పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ బందో బస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైసెన్స్ సర్వేయర్ పరీక్ష ఉంటుందన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాజీ వీఆర్వో, వీఆర్ఏలకు గ్రామపాలన ఆఫీసర్స్(జీపీవో) పరీక్ష, ప్రభుత్వ ఆశ్రమ బాలుర హైస్కూల్, ప్రభుత్వ ఆశ్రమ బాలుర హైస్కూల్‌లలో సీఆర్టీ ఎస్‌జీటీ పరీక్షా ఏంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని, పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని తెలిపారు.

# ఇచ్చోడలో మెగా జాబ్ మేళాకు భారీ స్పందన





- యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- నియామక పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- భారీ స్పందన.. వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు
- ఇంటర్వ్యూలు నిర్వహించిన 62 ప్రముఖ కంపెనీలు

**ఇచ్చోడ, జూలై 26 (ప్రభాత సమాచారం)**

బోథ్ నియోజకవర్గంలోని నిరుద్యోగుల కోసమే జాబ్‌మేళా నిర్వహించినట్లు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 62కు పైగా ప్రముఖ కంపెనీలు ఒకే చోట చేరి నిరుద్యోగులకు అవకాశాలు కల్పించాయి. ఈ సందర్భంగా జాబ్ మేళాకు ముందు ముఖ్యఅతిథులుగా వచ్చిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్‌లకు బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. మొదట జ్యోతి ప్రజ్వలన చేసి ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రిజిస్ట్రేషన్ చేయించుకున్న నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ఇచ్చోడ, సిరికొండ, గుడిహత్నూర్, నేరడిగొండ, బోథ్, తలమడుగు, తాంసి, సొనాల గుడిహత్నూర్ మండలాల నుంచి 6,448 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 4,532 మంది హాజరయ్యారు. 312 మంది అభ్యర్థులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నియామక పత్రాలు అందజేశారు.

**త్వరలోనే ఆసిఫాబాద్‌లో నిర్వహిస్తాం..**

ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని నిరుద్యోగుల కోసం త్వరలో జాన్సన్ నాయక్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతో జాబ్ మేళా నిర్వహిస్తామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. నిరుద్యోగుల కోసం ఇలాంటి జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు.

**అధికారంలో లేకున్న ప్రజా సేవలో ఉంటాం..**

అధికారంలో లేకున్న ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. నిరుద్యోగుల కోసం మాజీ మంత్రి కేటీఆర్, జాన్సన్ నాయక్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతో నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. తాము అధికారంలో లేకున్న ప్రజల్లో ఉండి సేవ చేసే వారే బీఆర్ఎస్ నాయకులని అన్నారు. అనం టతరం భుక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ.. ప్రజా సేవ చేయడం కోసమే బీఆర్ఎస్ నాయకులు ఉన్నారన్నారు. పార్టీలకు అతీతంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, బోథ్, ఇచ్చోడ మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, ప్రీతం రెడ్డి, ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి, బోథ్ మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ పెంటన్న, హెచ్‌వో కిరణ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు

## జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత



**దండేపల్లి, జూలై 26 (ప్రభాత సమాచారం)**

ఆయిల్ ఫామ్ సాగుతో రైతు సంపాదన స్థాయిని పెంచుతుందని జిల్లాఉద్యానవన శాఖ అధికారి అనిత అన్నారు. మామిడిపల్లి గ్రామాలోని సాగు చేస్తున్న ఆయిల్ ఫామ్, మా మిడి తోటలను శనివారం ఉద్యానవన క్లస్టర అధికారి సహజతో కలిసి ఆయిల్ ఫామ్ తోటను సందర్శించి వారు పరిశీలించారు. ఆయిల్ ఫామ్ సాగులో మెలకువలు పాటించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించి రైతులు మంచి లాభాలు పొందాలన్నారు. పంట సాగులో యా జమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం గెల కోత సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయిల్‌ఫామ్ అంతర్ పంటలు సాగు చేసుకునే వెసుబాటు ఉంటుందన్నారు. ఆ యిల్ ఫామ్ పంటల సాగుకు ప్ర భుత్వం అత్యధికం గా సబ్సిడి అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# పార్టీ అభివృద్ధికి నేతలు, కార్యకర్తలు సైనికులు



**నిర్మల్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

భారతీయ జనతా పార్టీ దేశంలో పరిపాలనకు ప్రతి కార్యకర్త నాయకుడు చేసిన కృషి ఫలితమేనని బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డివిజన్ స్థాయి ప్రజా ప్రతిదుల శిక్షణ సమావేశానికి ఎంపీ నగేష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ పార్టీలో పనిచేస్తున్న నేతలు కార్యకర్తలు క్రమశిక్షణకు పెట్టింది పేరని పార్టీ నిర్మాణంలో వారి కృషి అమోఘమని తెలిపారు. పనిచేసే నేతలకు తప్పకుండా పార్టీలో గౌరవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్,ముధోల్ ఎంఎల్ఏ రామ రావు పటేల్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ. హాజరయ్యారు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మంచిర్యాల, కొమురం భీం, అదిలాబాద్ జిల్లాల డివిజన్ మరియు మండల అధ్యక్షుల ప్రశిక్షణ శిబిరం నిర్వహించగా పార్టీ ప్రణాళిక పై చర్చించారు శనివారం నిర్మల్ లోని దివ్య గార్డెన్ లో హట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కార్గిల్ విజయంతో ప్రపంచానికి
# సత్తా చాటిన సైనికులు

## అమర జవాన్‌లకు నివాళులర్పించిన ఎమ్మెల్యే పాయల్ ఎమ్మెల్యే

**ఆదిలాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

భారతదేశ సైనికుల సత్తా ఏంటో పాకిస్తాన్ పై కార్గిల్ యుద్ధ విజయం ద్వారా ప్రపంచానికి చాటి చెప్పడం జరిగిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. కార్గిల్ విజయ దివస్ సందర్భంగా శనివారం ఆదిలాబాద్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గల కార్గిల్ పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద బిజెపి పార్టీ శ్రేణులు, మాజీ సైనికులతో కలిసి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత 25 ఏళ్ల క్రితం పాకిస్తాన్ సైనికులతో దేశ సైనికులు విరోచితంగా పోరాడి కార్గిల్ విజయాన్ని సాధించి పెట్టారని అన్నారు. ఈ యుద్ధంలో ఎంతోమంది దేశ సైనికులు అమరులయ్యారని, వారి త్యాగం ఎన్నటికీ వృధాపోదని పేర్కొన్నారు. కుటుంబాలను సైతం లెక్కచేయకుండా దేశ రక్షణకు సైనికులు చేస్తున్న కృషి గర్వకారణమన్నారు. ఎప్పుడు శాంతిని కోరుకునే భారతదేశం ప్రపంచమంతా శాంతియుతంగా ఉండాలని ఆకాంక్షిస్తుందన్నారు. మన రక్షణ కోసం అమరులైన వీర సైనికులకు నివాళులర్పించడం ప్రభుత్వం ద్వారానో, లేదా పార్టీలు ద్వారానో కాకుండా ప్రతి ఒక్కరూ స్వచ్ఛం దంగా ముందుకు రావాలన్నారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు, మాజీ సైనికులు, ఎన్.సి.సి క్యాడేట్లు పాల్గొన్నారు.

# గోరింట పండింది





**అందానికి, ఆనందానికి ప్రతీకగా నిలుస్తోంది మెహందీ... వివాహాలు, శుభకార్యాలు, పండుగలకు అతివల చేతుల్లో మెహందీ... మెరిసిపోతోంది.. మెహందీ పెట్టుకోవడం కూడా సంప్రదాయంగా మారిపోయింది.. అతివల మనసును దోచే ఎన్నో రకాల కోన్స్ మార్కెట్లో లభిస్తుండగా, బ్యూటీ పార్లర్లలో కూడా వివిధ రకాల డిజైన్లు చేతులపై వేస్తున్నారు.. కొత్త పెళ్లి కూతుర్లను వివిధ రకాల డిజైన్ల మెహందీతో మురిసి పోయే విధంగా ముస్తాబు చేస్తున్నారు. ఆషాఢ సమాసంలో అతివలు గోరింటాకు పెట్టుకునే ఆనవాయితీ మాత్రం ఇంకా కొనసాగుతోంది.**



- **అరచేతిలో అందం**
- **అతివల మనసు దోచుకుంటున్న మెహందీ**
- **మార్కెట్లో అందుబాటులోకి వివిధ రకాల కోన్స్..**
- **ఆసక్తి చూపుతున్న యువతులు**
- **ఎవర్‌గ్రీన్ ఫ్యాషన్ ట్రెండ్‌గా**



గోరింటా పండింది.. కొమ్మా లేకుండా.. ఈ పాట గతంలో ఓ సినిమాలో వినుంటాం. ఈ పాటలో ప్రామాణికం ఎంత ఉందో తెలియదు కానీ ఆషాఢంలో అతివలు గోరింటాకు పెటుకునే ఆనవాయితీ మాత్రం ఇంకా కొనసాగుతోంది. సాధారణంగా మహిళలు సౌందర్యానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తుంటారు. ముఖ సౌందర్యంతో పాటు చేతులు, కాళ్లను కూడా సింగారించుకుంటారు.

ఆషాఢంలో అయితే గోరింటాకు పెట్టుకుం టారు. ప్రస్తుత పరిస్థితుల్లో గోరింటాకు చెట్లు కనుమరుగవుతున్నాయి. గ్రామాల్లో అరుదుగా కనిపిస్తున్నాయి. దీంతో చేతులకు మైదాకు స్థానంలో రంగుల 'కోన్'లు అందుబాటులోకి వచ్చాయి. అందమైన, ఆకర్షణీయమైన డిజైన్లతో చేతులను సింగారించుకోవచ్చు.



### ప్రత్యేకతలెన్నో..

ఆషాఢ మాసాన్ని పురాణాల ప్రకారం శూన్య మాసంగా పిలుస్తారు. ఈ మాసంలో ఎలాంటి శుభకార్యాలు, ఇతర ఏ రకమైన కొత్త పనులకు శ్రీకారం చుట్టారు. ఇదే మాసంలో పార్వతీదేవి చేతులకు మైదాకు పెట్టుకుందనేది నానుడి. అప్పటి నుంచి ప్రతి ఆషాఢ మాసంలో మహిళలు చేతులకు మైదాకు పెట్టుకుంటారు. మైదాకు మంచిగా పండితే మంచి మొగుడొస్తాడనే నానుడి కూడా ప్రచారంలో ఉంది. మైదాకు పెట్టుకున్న మహిళల చేతులు బాగా పండితే రుతు క్రమంలో మార్పులు యథాస్థితికి చేరుకుంటాయని అంటారు. నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందని పండితులు చెబుతున్నారు.

### ఉపయోగాలెన్నో..

వైజ్ఞానికం, వైద్య శాస్త్రం ప్రకారం మైదాకు (గోరింటాకు) ఏడాదికి ఒక మారు పెట్టుకుంటే మంచిది. వేసవి అనంతరం వచ్చే వర్షాకాలంతో మహిళల శరీరాల్లో అనేక రకాలైన మార్పులు చోటు చేసుకుంటాయి. అందుకే ఆషాఢ మాసంలో ఒక మారు చేతులకు గోరింటాకు పెట్టుకుంటే రుతు క్రమంతో పాటు ఎలాంటి బ్యాక్టీరియానైనా తట్టుకునే శక్తి పెరుగుతుందని వైద్య శాస్త్రం చెబుతోంది. మెదడు లోని నాడీ వ్యవస్థ అరచేతికి అనుసంధానంగా ఉం టుంది. చేతి వేళ్లకు.. అరచేతి భాగంలో మైదాకు పెట్టు కుంటే ఇతర రోగాలు దరిచేరవని సూచిస్తున్నారు. అంతేగాకుండా శరీరంలో ఉన్న వేడి తొలగిస్తుంది.













## 'సలార్ 2'పై పృథ్వీ రాజ్ షాకింగ్ కామెంట్స్

ప్రభాస్ హీరోగా తెరకెక్కిన బ్లాక్‌బస్టర్ "సలార్: పార్ట్ 1 – సీస్‌ఫైర్" సినిమాకు సీక్వెల్‌గా రానున్న "సలార్ 2"పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో ప్రభాస్, పృథ్వీరాజ్ సుకుమారన్ మధ్య పోటా పోటీ సన్నివేశాలు ఉండనున్నాయట. తాజాగా తన తాజా చిత్రం "సర్ జమీన్" ప్రమోషన్ల సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పృథ్వీరాజ్, "సలార్ 2" గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఈసారి కథ, స్కోప్ ఇంకా పెద్దదిగా, సన్నివేశాలు మరింత గ్రాండిగా ఉంటాయని వెల్లడించారు. "ప్రభాస్‌తో మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ప్రభాస్ తో తలపడేందుకు ఎదురుచూస్తున్నాను" అని అన్నారు.ఈ వ్యాఖ్యలతో సలార్ 2 ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రభాస్ అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. పృథ్వీరాజ్ పాత్ర ప్రభాస్ పాత్ర తో తలపడనుందట, ఇద్దరి మధ్య జరిగే సన్నివేశాలు ఈసారి మరింత బలంగా ఉండబోతున్నాయని పృథ్వి తెలిపారు. అయితే, "సలార్ పార్ట్ 1"లో పృథ్వీరాజ్ పాత్రకు విమర్శకుల నుంచి, ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు వచ్చాయి. పృథ్వి నటన, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రభాస్‌కు తక్కువేమీ కాదని సినీ ప్రియులు అభిప్రాయపడ్డారు. దింతో సీక్వెల్‌పై అంచనాలు ఇప్పుడు మరింత పెరిగాయి. "సలార్ 2" ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలోనే అత్యంత ఆసక్తికరంగా ఎదురుచూసే సినిమాలలో ఒకటి. డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఈ ప్రాజెక్ట్ పార్ట్ 1 ని మించి ఉండబోతుందని తెలుస్తోంది.




## మస్త్ 'వైబ్ ఉంది బేబీ'.. మిరాయ్ ఫస్ట్ సాంగ్

తేజ సజ్జా లేటెస్ట్ మూవీ 'మిరాయ్' నుంచి ఫస్ట్ సింగిల్ లిరికల్ వీడియో విడుదల చేశారు. 'వైబ్ ఉంది బేబీ' అంటూ యూత్‌ఫుల్ గా సాగిన ఈ పాట ఫ్యాన్స్ కి మస్తు వైబిస్తుంది. ఈ పాటలో తేజ సజ్జ తన ఎనర్జిటిక్ డాన్స్ స్టెప్పులతో అదరగొట్టాడు. అలాగే హీరోయిన్ రితికా నాయక్, తేజ మధ్య రొమాంటిక్ సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. ఈ హుషారైన పాటను అర్మాన్ మాలిక్ పాడగా.. కృష్ణకాంత్ లిరిక్స్ అందించారు. యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా రూపొందుతున్న 'మిరాయ్' తేజ సజ్జా ఒక యోధుడిగా కనిపించబోతున్నాడు. భారతీయ పురాణ కథలను, చరిత్రను ఆధునిక యాక్షన్‌తో కలిపి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. దాదాపు ఎనిమిదికి పైగా భాషల్లో 2d, 3d ఫార్మట్స్ లో అందుబాటులోకి రానుంది. 'హనుమాన్' తర్వాత తేజ సజ్జా నుంచి రాబోతున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇందులో మంచు మనోజ్ విలన్ గా కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అలాగే శ్రియ శరణ్, జయరామ్, జగపతి బాబు కూడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్ తో నిర్మితమవుతున్న ఈ చిత్రంలో వీఎక్స్ రికార్డు స్థాయిలో ఉంటాయని తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ లో అద్భుతమైన విజువల్స్ సినిమా భారీ స్థాయిలో ఉండబోతుందని హింట్ ఇచ్చాయి.

## మీనాక్షి.. అబ్బా భలే ఉంది!

సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ ఫుల్ యాక్టీవ్ గా కనిపించే మీనాక్షి ఎప్పటికప్పుడు అందమైన ఫొటో షూట్లతో అభిమానులను ఫిదా చేస్తుంటుంది. తాజాగా బ్లాక్ మినీ స్కర్ట్ లో ఈ బ్యూటీ ఫోజులు కుర్రాళ్లకు నిద్ర పట్టనివ్వకుండా చేస్తున్నాయి. యంగ్ బ్యూటీ మీనాక్షి చౌదరీ ఇటీవలే 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. సోషల్ మీడియాలో ఎల్లప్పుడూ ఫుల్ యాక్టీవ్ గా కనిపించే ఈ ముద్దుగుమ్మ ఎప్పటికప్పడు అందమైన ఫొటో షూట్లతో అభిమానులను ఫిదా చేస్తుంటుంది. తాజాగా బ్లాక్ మినీ స్కర్ట్ లో ఈ బ్యూటీ ఫోజులు కుర్రాళ్లకు నిద్ర పట్టనివ్వకుండా చేస్తున్నాయి. సొగసైన అందాలతో మీనాక్షి గ్లామర్ షో నెట్టింట వైరల్ అవుతోంది. నేలపై పడుకుని ఫొటోలకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. ఈ ఫొటోలు చూసిన ఆమె అభిమానులు, నెటిజన్లు చూపు తిప్పకోలేకపోతున్నారు. మోడల్ గా కెరీర్ మొదలు పెట్టిన మీనాక్షి 2018 ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని సొంతం చేసుకుంది. ఆ తర్వాత మెల్లిగా సినిమాల్లోకి అడుగుపెట్టింది. మీనాక్షి 'అప్ స్టార్స్' అనే హిందీ సినిమాతో వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత తెలుగులో పలు సినిమాలు చేసింది. 'హిట్: ది సెకండ్ కేస్' తెలుగులో ఈ ముద్దుగుమ్మకు బ్రేకిచ్చింది. మీనాక్షి తెలుగులో ఇచ్చట వాహనములు నిలుపరాదు, గుంటూరు కారం, లక్కీ భాస్కర్, మట్కా, మెకానిక్ రాఖీ, సంక్రాంతికి వస్తున్నాం సినిమాల్లో నటించింది. 'లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం' కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్స్ అయ్యాయి. మిగతావన్నీ యావరేజ్ అనిపించుకున్నాయి. ప్రస్తుతం మీనాక్షి చేతిలో పెద్దగా సినిమాలేమి లేవు. నవీన్ పోలిశెట్టి సరసన 'అనగనగ ఒక రోజు' సినిమా చేస్తోంది.

## రికార్డులు క్రియేట్ చేస్తున్న 'సయ్యారా'

లేటెస్ట్ సెన్సేషన్ అహాన్ పాండే, అనీత్ పడ్డా హీరో హీరోయిన్లుగా తెరకెక్కిన రొమాంటిక్ డ్రామా "సయ్యారా" విడుదలైన మొదటి వారం నుంచే సూపర్ హిట్ టాక్ తో దూసుకుపోతోంది. ఎనిమిదవ రోజుకి రూ.18 కోట్లు వసూలు చేయడంతో, మొత్తం ఇండియా నెట్ కలెక్షన్ ఇప్పుడు సుమారు రూ.190.75 కోట్లకు చేరింది.'సయ్యారా' ఇప్పటికే అక్షయ్ కుమార్ నటించిన 'హౌస్‌ఫుల్ 5' (రూ.183 కోట్లు), అజయ్ దేవ్‌గన్ 'రైడ్ 2' (రూ.173 కోట్లు) లాంటి సినిమాల లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటి, 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన బాలీవుడ్ చిత్రాల్లో ఫస్ట్ ప్లేస్ లో నిలిచింది.ఈ శుక్రవారం కూడా ఎలాంటి హిందీ సినిమా విడుదల కానందున, 'సయ్యారా'కు వసూళ్ల పరంగా పోటీ లేదు. దీంతో ఈ శనివారం నాటికి ఇది రూ.200 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉంది. ఇది 2025లో విక్కీ కౌశల్ నటించిన 'ఛావా' తర్వాత ఆ ఘనత సాధించిన రెండవ బాలీవుడ్ చిత్రంగా నిలవనుంది.కథ పరంగా చూస్తే, సినిమా క్రిష్ కపూర్ అనే యువ సంగీతకారుడు, వాణీ బత్రా అనే రచయిత మధ్య ప్రేమను చాలా అద్భుతంగా చూపించారు. లవ్, ఎమోషన్స్, బ్రేక్ అప్ సీన్లను డైరెక్టర్ మోహిత్ సూరి తనదైన శైలిలో తెరకెక్కించారు.అయితే 'సయ్యారా' ఆగస్టు 1న విడుదలవుతున్న 'ధడక్ 2' వరకు థియేటర్లలో విజయవంతంగా కొనసాగే అవకాశాలున్నాయి. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటున్న ఈ సినిమా, ప్రస్తుతానికి బాక్సాఫీస్ హిట్ అయ్యి టాక్ అఫ్ ది టౌన్ గా నిలిచింది.





# ఎడతెరిపిలేని వాన

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో క్షేత్రస్థాయిలోకి ఉమ్మడి జిల్లా అధికార యంత్రాంగం
- ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక అధికారి హరికిరణ్ ■ అధికారులతో సమీక్ష, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా
- భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- ప్రాజెక్టుల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి ■ జిల్లాలకు చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- కడెం ప్రాజెక్టులో మాక్ డ్రిల్ ■ కడెం, కొమరం భీమ్ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత
- నిర్మల్ ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వర్షం ■ ఆసిఫాబాద్, మంచిర్యాలలో ముసురు

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వర్షం దంచి కొట్టింది. నిర్మల్ ఆదిలాబాద్ జిల్లాలో శనివారం తెల్లవారుజాము నుంచి రోజంతా భారీ వర్షాలు పడ్డాయి. కాగా మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ముసురు వర్షం ఉంది. వర్షాకాలం ప్రారంభం అయిన నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తొలిసారిగా భారీ వర్షాలు నమోదు అయ్యాయి శుక్రవారం అర్ధ రాత్రి దాటిన నుంచి శనివారం ఉదయం మధ్యాహ్నం సాయంత్రం పలుసార్లు ఎడతెరిపించినప్పటికీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి ఈ వానలు ఆదివారం కూడా కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రధానంగా నిర్మల్ జిల్లాలో భారీ వర్షాలు నమోదు అయ్యాయి నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్లపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి డాక్టర్స్ లైన్, మంచిర్యాల చౌరస్తా, శాస్త్రి నగర్ రోడ్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపైకి వరద నీరు చేరింది. పలు లోతట్టు ప్రాంతాలు వరద నీటితో నిండిపోయాయి. ముధోల్ నియోజకవర్గంలో పలుచోట్ల భారీ వరదల కారణంగా పంటచేలు ముంపునకు గురయ్యాయి అలాగే ఝరి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి ఆ గ్రామం జలదిబ్బంధంలో ఉంది. కడెం ప్రాజెక్టు నకు భారీ వరదవస్తుండడంతో సాయంత్రం రెండు గేట్లను ఎత్తి వరద నీటిని వాగులోకి వదులుతున్నారు అలాగే ఆసిఫాబాద్ జిల్లా కొమరం భీం ప్రాజెక్ట్ ఒక గేటును ఎత్తి నీటిని వదులుతున్నారు. కాగా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుకు ఆరున్నర వేల క్యూసెక్కుల చొప్పున వరద వస్తున్నది. గడ్డం వాగు ప్రాజెక్టుకు సైతం శనివారం సాయంత్రం నుంచి 6000 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు జలపాతాలు వర్షం కారణంగా కళకళ లాడుతున్నాయి. వరదలతో జాలు వారుతున్నాయి. రాష్ట్రంలోనే పేరు ఉన్న కుంటాల జలపాతం నిండుగా పారుతున్నది. ఈ వరద కడెం ప్రాజెక్టు నిండేందుకు కారణం అవుతున్నది. పొచ్చర, గాయత్రి, కొరటికల్ సహా ఉమ్మడి జిల్లాలోని పలు చిన్న చిన్న జలపాతాలు నీటి అందాలతో అల రారుతున్నాయి. దీంతో పర్యాటకుల సందడి పెరుగుతున్నది.

**అధికార యంత్రాంగం అప్రమత్తం..**

భారీ వర్షాల కారణంగా ఉన్నత స్థాయి అధికార యంత్రాంగం సర్వత్ర అప్రమత్తం అయింది. ప్రత్యేకంగా నియమించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఐఏఎస్ అధికారి హరికిరణ్ జిల్లాలోనే ఉండి సమీక్షిస్తున్నారు శనివారం మధ్యాహ్నం నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన కడెం ప్రాజెక్టును సందర్శించారు అక్కడే ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలపై సైతం ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుల నీటిమట్టలపై ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద గురించి ఆరా తీశారు. ఉమ్మడి జిల్లాలో ఆస్తి ప్రాణ నష్టం జరగకుండా అధికారులతో సమీక్షిస్తున్నారు.

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వీడని ముసురు వాన**

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి ముసురు వాన కురుస్తోంది. ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కుమరం భీం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరడంతో ఒక గేటు ఎత్తి కిందికి వదులు తున్నారు. చింతలమానేపల్లి మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి రోడ్లు పూర్తిగా అస్తవ్యస్తం కాగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంటలు నీట మునిగాయి. శనివారం సాయంత్రం వర్షం తగ్గింది. మూడు రోజులుగా దిందా గ్రామస్థులకు రాక పోకలు నిలిచిపోయాయి. శనివారం సాయత్రం వాగు ప్రవాహం తగ్గడంతో గ్రామస్థులు బయటకు వెళ్తున్నారు. ఖర్జవెల్లి నుంచి గూడెం వరకు ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయం కావడంతో పాటు బురదమయంగా మారింది. గూడెం- కోయపల్లి రద్దు పూర్తిగా ధ్వంసమైంది. కోయపల్లి నుంచి బెజ్జూరు వెళ్లే రోడ్డు అస్తవ్యవస్తంగా మారడంతో రాకపో కలు నిలిచి పోయాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో అత్యధికంగా లింగాపూర్‌లో 9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తిర్యాణిలో 8.5, సిర్పూర్(టి), కెరమెరి మండలాల్లో 5.3, బెజ్జూరు, పెంచికలపేట, కౌటాల మండలాల్లో 5.0, జైనూరులో 4.5, కాగజ్‌నగర్‌లో 4.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



# భారీ వర్షాలకు బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

- వర్షాలకు ఓపెన్‌కాస్ట్‌లోకి భారీగా చేరిన వరద నీరు
- ఉపరితల గనుల్లో నిలిచిన పనులు - సంస్థకు రూ.కోట్లలో నష్టం



**మంచిర్యాల, జూలై 26 (ప్రభాత సమాచారం)**

జిల్లా వ్యాప్తంగా గత నాలుగు రోజుల నుండి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం అత్యధికంగా జన్నారం, దండేపల్లి, మందమర్రి,కాసిపేట మండలంలో 11 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదయింది. ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరుతుంది, ఇప్పటికే కడెం ప్రాజెక్టు నుండి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు, ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి సుమారు 6వేల క్యూసెక్కుల వరద నీరు ఎగువ ప్రాంతం నుండి చేరుతుంది. నీటిమట్టం 148 మీటర్లకు గాను 144 మీటర్ల వర కు నీరు చేరింది. సింగరేణి ఉపరితల గనులలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. గత ఐదు రోజుల నుండి శ్రీరాంపూర్ ఇందారం రామకృష్ణాపూర్ మందమర్రి ఓసీపీలలో రోజుకు 30 వేల టన్నుల మేర బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. గత ఐదు రోజుల నుండి ఉపరితల గనులలో ఉత్పత్తి నిలిచిపోయింది. గనులలో ఉపయోగించే భారీ వాహనాలను ప్రాజెక్టు ప్రాంతాలలో నిలిపి ఉంచారు. మరో రెండు రోజులపాటు వర్షాలు మోస్తారుగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే వర్షపాతం తక్కువగానే నమోదయింది. చెరువులు కుం టల్లో సరిపోను నీరు చేరలేదు. దీంతో రైతులు ఇంకా సాగు పనులను ప్రారంభి ంచలేదు. ప్రాణహిత నది సరిహద్దు ప్రాంతాలైన కోటపల్లి వేమనపల్లి చెన్నూరు మండలాల పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు ఉప్పొంగుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



# ధర్నాను విజయవంతం చేయండి

**జైనూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

ఆదివాసుల హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉయిక చందన్ సావ్ అన్నారు. జీవో నెంబర్ 49 ఆదివాసి హక్కలను, చట్టాలను కాలరాస్తుందని ఆరోపిస్తూ ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఈ నెల 28 న ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చుయాన్నారు. ఈ జీవో 49 ను వెంటనే శాశ్వతంగా రద్దు చేయాలని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలను ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ తరపున డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. జైనూర్ మండల అధ్యక్షులు మధురాజ్ మడావి మాట్లాడుతూ 49 జీవోతో ఆదివాసుల భూములమీద హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని, అటవీ హక్కులు, జీవనోపాధి, సాంస్కృతిక విలువలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని, దీనిని శాశ్వతంగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మన పరిరక్షణ కోసం ఐక్యతతో ముందుకు రావాలని అన్ని ఆదివాసి సంఘాలను పిలుపునిచ్చారు. ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్య టదర్శిలు ఆత్రం అర్జున్, తుమ్రం దీలిప్ కుమార్, సంయుక్త కార్యదర్శి గేడం నగేష్ , కోశాధికారి మెస్రం దత్తు,వీరితో పాటు మండాడి లింగు, ఆత్రం శంకర్,ఉర్వేత మాన్కు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**నిర్మల్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

పారిశుద్ధ్యంపై శ్రద్ధ అవసరమని మేడిపల్లి గ్రామ కార్యదర్శి వినోద్ కుమార్ పేర్కొన్నారు. నిర్మల్ రూరల్ మండలంలోని మేడిపల్లిలో ఖాళీ ఇంటి స్థలాలు ఉన్న చోట క్లోరినేషన్ చేపట్టారు. ఇండ్ల పరిసరాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దోమల నివారణకు వీధులలో ఫాగింగ్ చేస్తున్నామని, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.



# జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నది. సెప్టెంబర్ 30వ తేదీలోగా ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులతో ప్రభుత్వం ఈ ప్రక్రియను ముమ్మరం చేసింది. జిల్లా ప్రజా పరిషత్, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు అయ్యాయి. నిర్మల్ జిల్లాలో 18 జడ్పీటీసీ స్థానాలు, 157 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ఇందులో గతంలో పోల్చితే ఒక ఎంపీటీసీ స్థానం పెరిగింది. మొత్తం పోలింగ్ కేంద్రాలు 892 ఏర్పాటు చేశారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను బ్యాలెట్ ద్వారా నిర్వహించనున్నారు. ఇందులో నోటా ముద్రించేందుకు ఎన్నికల సంఘం ఆదేశించింది. ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించనున్నారు. జడ్పీటీసీ బ్యాలెట్ పేపరు తెలుపు రంగు, ఎంపీటీసీ బ్యాలెట్ పేపరు గులాబీ రంగులో ముద్రించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలపై స్పష్టత రావడంతో వాటి నియోజకవర్గాలవారీగా ఓటర్ల విభజన పూర్తి చేశారు. స్థానాలు ఖరారు కావడంతో రిజర్వేషన్ల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్సు చేసి గవర్నర్ ఆమోదం కోసం పంపింది. ఆమోదం అనంతరం రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయనున్నారు.







## గ్యాస్ కట్టర్‌తో కట్‌చేసి
# ఎస్‌బిఐ ఏటీఎంలో చోరీ

■ రూ.14లక్షల చోరీ ■ బ్యాంకులోని సీసీ కెమెరాలకు చిక్కకుండా బ్లాక్ స్ప్రేతో బ్రేక్ ■ ఆదిలాబాద్‌లో ఘటన

**ఆదిలాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ జరిగింది. శనివారం తెల్లవారుజామున ఆదిలాబాద్ పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి చొరబడిన దుండగులు.. సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే కొట్టారు. అనంతరం గ్యాస్ కట్టర్‌తో మెషిన్‌ను కట్ చేసి డబ్బులు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్యాంకు అధికారులకు విషయం తెలియజేశారు. అందులో నగదు ఎంత ఉందన్న విషయం తెలియాల్సి ఉంది. అయితే దొంగల ముఠా చొరబడి తమ ఆనవాళ్లు చిక్కకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ముందుగా సిసి కెమెరాలకు బ్లాక్ స్ప్రే కొట్టి ఆ తర్వాత గ్యాస్ కట్టర్ల సాయంతో లాకర్ ను చాకచక్యంగా పగలగొట్టి అందులో నిల్వ ఉన్న రూ. 14లక్షల నగదుతో ఉడాయించారు. ఏటీఎంలలో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర ముఠా అతి తెలివిగా వ్యవహరించి దొంగతనం చేసి పారిపోయినట్టు తెలుస్తోంది. బ్యాంకులకు నాలుగో శనివారం సెలవు దినం, మరుసటి రోజు ఆదివారం రావడంతో ఏటీఎంలో పెద్ద మొత్తంలో డబ్బు జమ చేస్తారని భావించి దొంగల గ్యాంగ్ పథకం ప్రకారమే ఏటీఎంకు కన్నం వేసినట్టు తెలుస్తోంది. అక్కడ బ్యాంకు, ఎటిఎం ఉన్నప్పటికీ వాచ్ మెన్ లేకపోవడం చోరీ జరగడానికి కారణమని తెలుస్తోంది. ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కర్రే స్వామి, టూ టౌన్ సీఐ కరుణాకర్, మావల ఎస్ఐ అక్కడికి చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. ఏటీఎంకు కన్నం వేయడం ఇది రెండోసారి.. ఆదిలాబాద్ పట్టణ నడిబొడ్డున సరిగ్గా నాలుగేళ్ల కిందట బీహార్ రాష్ట్రానికి చెందిన దొంగల ముఠా ఒక బంగారు దుకాణంలో, మరో ఏటీఎంలో చొరబడి రూ.20 లక్షల నగదును దోచుకెళ్లారు. అప్పట్లో ఈ చోరీ ఘటన జిల్లాలో సంచలనం రేపింది. ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డీస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. కాగా చోరీకి ఏటీఎంను డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు స్వామి, సునీల్ కుమార్ పరిశీలించారు. క్లూస్ టీమ్ రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉమ్మడి జిల్లాకు రూ.4 కోట్లు మంజూరు
### నిర్మల్ కలెక్టర్ లేఖకు రాష్ట్ర ప్రభుత్వ స్పందన

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**
భారీ వర్షాలు, ఆపద కాల అత్యవసర ఖర్చుల కోసం ప్రభుత్వం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ. 4కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ నిధులు విడుదల చేసింది. ఈ నిధులు జిల్లా ల్లో వానా కాలంలో ఆపద సమయంలో ఉపయోగించే సామగ్రి, ఇతర అవసరాల కోసం ఖర్చు చేసేందుకు ఉపయోగపడనున్నాయి. ఇటీవల నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యవసర నిధుల కోసం ప్రతిపాదనలు చేస్తూ లేఖ రాయగా ఈ మేరకు ప్రభుత్వం స్పందించింది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న తీరు, ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలోనూ రూ. కోటి మంజూరు చేస్తామని ప్రకటించారు. జిల్లా కలెక్టర్ల వద్ద ఉండే ఈ అత్యవసర నిధితో ఎయిర్ బోట్స్, లైఫ్ 'కెట్స్, సైరన్స్, తాళ్లు, గ్యాస్ కట్టర్స్, నిచ్చెనలు తదితర వరదలతో ప్రమాదాలు ఏర్పడినప్పుడు ఉపయోగించే సామగ్రిని కొనుగోలు చేయనున్నారు. ఆపద మిత్ర స్వచ్ఛంద సేవకులు, రెవెన్యూ విపత్తు నిర్వహణ సిబ్బందికి ఈసామగ్రి ఎంతగానో ఉపయోగపడనుంది.

## కేజీవీల్స్ ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి





**దహెగాం, జూలై 26 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఒడ్డుగూడ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని ఎల్కరి మల్లేశ్ కేజీవీల్స్ ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందాడు. ఏఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. బ్రహ్మన్ చిచ్యాల గ్రామశివారులో పొలంలో శనివారం కేజీవీల్స్ ట్రాక్టర్ పని పూర్తి చేశాడు. మధ్యాహ్నం ఇంటికి వెళ్లడానికి బయటకు వస్తున్న క్రమంలో ట్రాక్టర్పై నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ట్రాక్టర్ అతనిపై నుంచి వెళ్లడం తో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య ఎల్క రి రాజక్క ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కూతురు ఉన్నారు.

## సీఆర్టీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి



**ఉట్నూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**
నేడు జరిగే సీఆర్టీ అర్హత పరీక్షను పకడ్బందీగా చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. స్థానిక కుమురం భీం కాంప్లెక్స్ పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఎస్ఓసీ గంగాధర్, డీడీ అంబాజీ, ఈపీవోపీవీటీజీ మనోహర్, పీహెచ్ సందీప్ కుమార్, డీఎంజీసీసీ, ఏసీఎంవో జగన్ కలిసి ఇన్విజిలేటర్లు, చీఫ్ స్పెషల్ ఆఫీసర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పరీక్షకు 2200 మంది అభ్యర్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. గంట ముందుగానే కేబీ కాంప్లెక్స్ పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఓటర్ ఐడీ, ఆధార్ కారు, డ్రైవింగ్ లైసెన్స్ ఏదైనా ఒకటి తీసుకురావాలని సూచించారు. సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు అనుమతి లేదన్నారు. ప్రతి హాళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

**ఖానాపూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**
రైతు ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం.. సుర్దాపూర్ గ్రామానికి చెందిన సంగ రాములు (65).. భార్య యశోద అనారోగ్యం బాధపడుతోంది. చికిత్స కోసం అప్పు లు చేశాడు. అయినప్పటికీ ఆరోగ్యం మెరుగు పడక ఏడాది క్రితం భార్య మృతిచెందింది. చేసిన అప్పులు తీరలేదు. దీంతో కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నాడు. శనివారం తన చేనులో ఉరేసుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమా రుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

**ఆసిఫాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ మండలంలోని సంజీవయ్య కాలనీకి చెందిన ఇగురపు శ్రీనివాస్ (40) శనివారం వేకువజామున రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారని రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం సంజీవయ్య కాలనీ శివారులోని రైల్వే ట్రాక్ పై శ్రీనివాస్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, అతడు శ్రీనివాస్‌గా గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు కానిస్టేబుల్ సురేష్ తెలిపారు.

## ఇంద్రవెల్లి హెచ్‌ఎంకు చార్జీ మెమో

**ఇంద్రవెల్లి, జూలై 26 (ప్రభాత సమాచారం)**
ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంమోహన్‌కు వరంగల్ ఆర్జేడీ సత్యానారాయణ రెడ్డి చార్జీ మెమో జారీ చేశారు. ఇటీవల ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు ఫిర్యాదు చేశారు. పీఎం శ్రీ నిధు లతోపాటు ఇతర నిధులను దుర్వినియోగం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కలెక్టర్ రాజర్షి షా ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌ను విచారణాధికారిగా నియమించారు. సబ్ కలెక్టర్‌కు హెచ్‌ఎం సరైన రికార్డులు చూపించలేదని విచారణలో స్పష్టమైంది. హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని డీఈవో శ్రీనివాసరెడ్డి ఆర్జేడీని కోరారు. ఈమేరకు సదరు హెచ్‌ఎంకు చార్జీ మెమోజారీ చేశారు. పది రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

## ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

**ఇంద్రవెల్లి, జూలై 26 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నాందేవ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లుగా విద్యార్థులు ఇటీవల షీటీం దృష్టికి తీసుకెళ్లారు. ఆయనపై ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఉపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

## అడవి బిడ్డల కోసం దేనికైనా సిద్ధం
### గిరిజనులపై అత్యుత్సాహం చూపొద్దు
### అటవీ అధికారులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వార్నింగ్

**కడెం, జూలై 26 (ప్రభాత సమాచారం)**



'అడవి బిడ్డల కోసం తాను దేనికైనా సిద్ధం..అటవీ అధికారులకు పులుల మీద ఉన్న ప్రేమ.. అమాయకులైన అడవి బిడ్డలపై లేదు..' అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప టేల్ అన్నారు. గిరిజనులపై అటవీ అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారని ఆరోపించారు. పోలీసులు అటవీ అధికారులకు సహకరించొద్దని కోరారు. కడెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ అభిలాష అభినవ్ సమక్షంలో అటవీ అధికారులకు ఎమ్మెల్యే వార్నింగ్ ఇచ్చారు. పోడు రైతులను అడ్డుకునే సమయంలో అటవీ అధికారులు వెనక ఉంటారని, ముందు వరుసలో ఉండే పోలీసులే దెబ్బలు తింటారని పేర్కొన్నారు. అటవీ అధికారులకు సహకరించొద్దని పోలీసులకు సూచించారు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఖానాపూర్ నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు విద్యుత్, రోడ్డు, తాగు నీటి సౌకర్యాలు లేవన్నారు. ఇవేమీ కల్పించకుండా పోడు రైతులను అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైన అటవీ అధికారులు పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి
### లక్షెట్టిపేట న్యాయమూర్తి సాయికిరణ్

**జన్నారం, జూలై 26 (ప్రభాత సమాచారం)**
చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లక్షెట్టిపేట కోర్టు న్యాయమూర్తి సాయికిరణ్ అన్నారు. శనివారం మండలంలోని ఇందనపల్లి గ్రామ పంచాయతీలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. డబ్బులు లేవని న్యాయస్థానానికి రాకుండా ఉండవ ద్దని, డబ్బులు పెట్టే స్థితిలో లేని వారికి ఉచితంగా న్యాయం జరిగేలా కోర్టు సహకరిస్తుందని అన్నారు. కోర్టు ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందాలని సూచించారు. గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి అమ్మినా, సేవించినా చట్ట ప్రకారం నేరమని తెలిపారు. గంజాయి మత్తు పదార్థాలతో యువకులు భవిష్యత్ పాడు చేసుకోవద్దని సూచించారు. గ్రామస్తులు న్యాయ మూర్తిని శాలువాలతో సన్మానించారు. లక్సెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ఉపాధ్యక్షుడు నళినికాంత్, న్యాయవాదులు కిరణ్ కు మార్, పద్మ, తాజొద్దీన్, రవీందర్, ఎస్ఆర్వో శ్రీధ రచారి, ఎస్సై అనూష, తదితరులు పాల్గొన్నారు.



**మహా విష్ణువు దశావతారాల ఆధారంగా పదేళ్ల పాటు వరుసగా సినిమాలు రూపొందనున్నాయి. 'మహావతార్' సినిమాటిక్ యూనివర్స్ (ఎంసీయూ) పేరుతో క్లీమ్ ప్రొడక్షన్స్, ప్రఖ్యాత హోంబలే ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాల్ని పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాయి. ఈ యూనివర్స్ లో భాగంగా ప్రేక్షకుల ముందుకొచ్చిన తొలి చిత్రం 'మహావతార్ నరసింహ'. మరి ఈ చిత్రం ఎలా ఉంది? యానిమేటెడ్ విజువల్స్ అలరించాయా?**



# పురాణాలకు సరికొత్త ఆవిష్కరణ
# మహావతార్ నరసింహ

## కథేంటంటే..

అందరికీ తెలిసిన పురాణ కథే. శ్రీమహావిష్ణువు నరసింహావతారం ఆధారంగా రూపొందిన చిత్రమిది. 'మీరు సృష్టించిన ఏ జీవి వల్ల, ఎలాంటి కాలంలోనూ ఏ అస్త్ర శస్త్రాల నుంచి తన ప్రాణాలకి ముప్పు కలగకూడదు' అని బ్రహ్మ దేవుడి నుంచి వరం పొందుతాడు రాక్షసరాజు హిరణ్యకశిపుడు. వరం పొందిన తర్వాత ముల్లోకాలకు తానే అధిపతినని, తానే భగవంతుడినని ప్రకటించుకుంటాడు. భూలోకంలో ధర్మాన్ని కాలరాస్తాడు. తన సోదరుడి మరణానికి కారణమైన మహావిష్ణువుపై మరింత కోపంతో రగిలిపోతుంటాడు. కానీ, తన కుమారుడు ప్రహ్లాదుడు శ్రీవిష్ణువుకి అపర భక్తుడిగా మారతాడు. ఇది సహించలేని హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని చంపేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేశాడు? తనకెంతో ప్రీతిపాత్రమైన భక్తుడు ప్రహ్లాదుడిని మహావిష్ణువు ఎలా కాపాడాడు? ఎలాంటి పరిస్థితుల్లో నరసింహావతారం ఎత్తాల్సి వచ్చింది? హిరణ్యకశిపుడి సంహారం ఎలా జరిగింది?

## ఎవరెలా చేశారంటే..

యానిమేషన్ పాత్రలతో రూపొందిన సినిమా ఇది. ఆ ప్రయత్నం మంచి ఫలితాల్నే ఇచ్చింది. నటులు తెరపై కనిపిస్తే వాళ్లకున్న ఇమేజ్ ప్రభావం సినిమాపై పడే అవకాశం ఉండేది. యానిమేషన్ కావడంతో పాత్రలతోనూ, ఆ భావోద్వేగాలతోనూ మరింతగా కనెక్ట్ అవుతూ, వాటితో కలిసి ప్రయాణం చేస్తాం. అయితే, విజువల్స్ లో నాణ్యత కీలకం. ఆ విషయంలో ఈ చిత్రబృందం తీసుకున్న శ్రద్ధ ప్రశంసనీయం. కథానుసారం విజువల్స్ న్ ఆవిష్కరించిన విధానం ఈ సినిమాకి ప్రధానబలం. వరాహావతారం, భూదేవిని చూపించిన తీరు, ప్రహ్లాదుడిని ఏనుగులతో తొక్కి చంపించేందుకు చేసే ప్రయత్నాలు, హోలిక ఎపిసోడ్, నరసింహావతారంతో కూడిన పతాక సన్నివేశాలు ఈ సినిమాకి హైలైట్. ఆయా సన్నివేశాల్లో విజువల్ గ్రాండ్నెస్ ఆకట్టుకుంటుంది. సాంకేతిక విభాగాల్లో సంగీతం మరో ఎత్తు. సామ్ సీఎస్ నేపథ్య సంగీతం ఈ సినిమాకి ప్రాణం పోసింది. అశ్విన్కుమార్ స్క్రీన్ప్లే రచన, దర్శకత్వం మెప్పిస్తుంది. తెలిసిన కథే అయినా ఆసక్తికరంగా చెప్పారు. నిర్మాణం ఉన్నతంగా ఉంది.

## ఎలా ఉందంటే..

ఒకప్పుడు తెరపై ప్రేక్షకులను అలరించినవన్నీ పురాణ గాథలే. ఆ తర్వాత వర్తమానాన్ని ప్రతిబింబించే సామాజికాంశాలతోనే ఎక్కువగా సినిమాలు రూపొందుతూ వచ్చాయి. మన సంస్కృతికి అద్దం పట్టే పురాణ కథలను సరికొత్త సాంకేతికత సహాయంతో తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రస్తుతం జరుగుతున్నాయి. భాగవతంలోని ప్రహ్లాదుడి భక్తి, హిరణ్యకశిపుడి సంహారం నేపథ్యం గురించి తెలుగు చిత్ర పరిశ్రమలో తరచూ చర్చ జరుగుతూనే ఉంటుంది. 'హిరణ్య' పేరుతో ఆ కథని తెరపైకి తీసుకురావాలనే ప్రయత్నాలు కూడా జరిగాయి. ఈ దశలో, అదే కథాంశంతోనే 'మహావతార్ నరసింహ' ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా చూస్తే, ఈ కథకు ఉన్న స్థాయి బాగా అర్థమవుతుంది. భావోద్వేగాలు, డ్రామా, హీరోయిజం, విలనిజం, సెంటిమెంట్ని పండించేందుకు ఆస్కారమున్న కథ ఇది.

దితి, కశ్యప జంట కలయిక.. హిరణ్యకశిప, హిరణ్యాక్షుల జననం నుంచి సినిమా మొదలవుతుంది. వాళ్లు ఏ కారణంతో రాక్షసులుగా జన్మించారు? ఆ ఇద్దరి రాక్షస స్వభావం ఎలాంటిదో చూపెడుతూ ప్రేక్షకుడిని కథలో లీనం చేస్తుంది సినిమా. భూదేవిని చెరపట్టిన హిరణ్యాక్షుడిని విష్ణువు వరాహ అవతారమెత్తి సంహరించడం మొదలుకొని సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. బ్రహ్మదేవుడి కోసం హిరణ్యకశిప తపస్సు చేసి వరం పొందడం, ప్రహ్లాదుడి జననం, అతనికి వాసుదేవుడిపైన ఉన్న అపారమైన భక్తి తదితర సన్నివేశాలు ప్రథమార్థంలో కీలకం. ప్రహ్లాదుడిని అంతం చేయాలని తండ్రి హిరణ్యకశిప నిర్ణయించడం, రకరకాల ప్రయత్నాలతో విఫలం కావడం, హోలిక సాయం తీసుకోవడం వంటి సన్నివేశాలు ద్వితీయార్థంలో మంచి డ్రామాని పండించాయి. ఇవన్నీ ఒకెత్తయితే పతాక సన్నివేశాల్లో నరసింహావతారం మరో ఎత్తు. ప్రథమార్థంలో వరాహ అవతారానికి పదింతలు అన్నట్టుగా నరసింహావతారాన్ని అద్భుతంగా తెరపై ఆవిష్కరించారు. హిరణ్యకశిపుడికి నరసింహుడికి మధ్య జరిగే యుద్ధం ఆకట్టుకుంటుంది. ఆ సన్నివేశాల్ని మలిచిన తీరు, సంగీతం ప్రేక్షకులతో చప్పట్లు కొట్టిస్తాయి.

**చిత్రం :** మహావతార్ నరసింహ
**సంగీతం :** సామ్. సీఎస్..
**నిర్మాతలు :** శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్, చైతన్య దేశాయ్
**కథనం, దర్శకత్వం :** అశ్విన్ కుమార్

# నిరంతర విజ్ఞాన జ్వాల
## - డాక్టర్ అబ్దుల్ కలాం



నిరాడంబర నేపథ్యం నుండి ఉన్నత శిఖరాలకు చేరే గొప్ప వ్యక్తులు శతాబ్దానికోసారి పుడతారు. పుట్టే మహనీయులు తరతరాలు గుర్తుండిపోతారు. అటువంటి వారిలో ఒకరు ఎప్పటికీ గర్వించదగ్గ వ్యక్తి వర్ధంతి జూలై 27వ తేదీ. ఆయనే భారతదేశపు మహోన్నత నాయకులలో ఒకరైన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం. ఆయన కేవలం మాజీ రాష్ట్రపతి, గొప్ప శాస్త్రవేత్త మాత్రమే కాదు. రాజకీయాలకు అతీతంగా దేశ ప్రజలందరినీ ముఖ్యంగా యువతను ఉత్తేజపరిచిన దార్శనికుడు, ఉపాధ్యాయుడు. ఆయన గత విజయాలను గుర్తు చేసుకుంటూనే ఆయన ఆశయాలు నేటికీ భారతదేశ భవిష్యత్ ను ఎలా ప్రభావితం చేస్తున్నాయో మనం తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**జననం..**
1931 అక్టోబర్ 15న తమిళనాడులోని రామేశ్వరంలో ఒక నిరుపేద తమిళ ముస్లిం కుటుంబంలో ఆయన జన్మించారు. తండ్రి స్థానిక మసీదులో ఇమామ్‌గా పని చేయగా, తల్లి గృహిణి. కుటుంబానికి అండగా నిలిచేందుకు కలాం యుక్త వయస్సులో వార్తాపత్రికలు విక్రయించేవారు.

**విద్యాభ్యాసం..**
రామనాథపురంలోని స్క్వార్ట్జ్ సెకండరీ స్కూల్‌లో సెకండరీ చదువు పూర్తి చేశారు. ఆ తర్వాత తిరుచిరాపల్లిలోని సెయింట్ జోసెఫ్ కళాశాల నుండి భౌతిక శాస్త్రంలో డిప్లొమా పొందారు. మద్రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ నుండి ఎయిర్ క్రాఫ్ట్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పొంది మిలటరీ పైలట్ కావాలని కలలు కన్నారు. 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా దేశానికి సేవలు కలాం గారి జీవితం దేశ సేవకే అంకితం. ఆయన శాస్త్రవేత్తగా సాధించిన విజయాలు భారతదేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేశాయి. అందుకే ఆయనను ముద్దుగా 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అని పిలుస్తారు.

**ఉపగ్రహ ప్రయోగ వాహనాల రూపకల్పన..**
భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం అభివృద్ధికి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా కలాం కీలక పాత్ర పోషించారు. ఇది 1980 జూలైలో రోహిణి ఉపగ్రహాన్ని విజయవంతంగా భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఇస్రో లాంచ్ వెహికల్ ప్రోగ్రామ్ కాన్ఫిగరేషన్ అభివృద్ధికి ఆయన బాధ్యత వహించారు.

**క్షిపణి వ్యవస్థల అభివృద్ధి..**
ఇస్రోలో రెండు దశాబ్దాల అనుభవం తర్వాత కలాం డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్లో ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా చేరారు. అగ్ని, పృథ్వీ వంటి స్వదేశీ క్షిపణుల అభివృద్ధికి ఆయన నాయకత్వం వహించారు. వివిధ సంస్థలను సమన్వయం చేస్తూ, క్లిష్టమైన సాంకేతికతలలో స్వదేశీ సామర్థ్యాన్ని పెంపొందించారు.

**అణు శక్తిలో కీలక పాత్ర..**
1992 జూలై నుండి 1999 డిసెంబర్ వరకు డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్ట్ మెంట్ సెక్రటరీగా, డిఫెన్స్ మినిస్టర్‌కి సైంటిఫిక్ అడ్వైజర్‌గా పనిచేశారు. ఈ కాలంలో, అటామిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ సహకారంతో పోఖ్రాన్II అణు పరీక్షలకు నాయకత్వం వహించారు. ఇది మన దేశాన్ని అణ్వాయుధ దేశంగా మార్చింది. లైట్ కంబాట్ ఎయిర్ క్రాఫ్ట్ వంటి అనేక మిషన్ ప్రాజెక్ట్ ను కూడా అభివృద్ధి చేశారు.

**శాస్త్రీయ సలహాదారుగా..**
1999 నవంబర్ నుండి 2001 నవంబర్ వరకు భారత ప్రభుత్వానికి ప్రధాన శాస్త్రీయ సలహాదారుగా పని చేశారు. టెక్నాలజీ ఇన్ఫర్మేషన్, ఫోర్ కాస్టింగ్ అండ్ అసెస్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్‌గా 500 మంది నిపుణుల సహాయంతో భారతదేశాన్ని అభివృద్ధి చెందుతున్న స్థాయి నుండి అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి ఒక రోడ్ మ్యాప్‌ను అందించే 'టెక్నాలజీ విజన్ 2020'కి ఆయన నాయకత్వం వహించారు. అనేక అభివృద్ధి అనువర్తనాలకోసం విధానాలు, వ్యూహాలు, మిషన్లను రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

**రాష్ట్రపతి'గా దేశ సేవ..**
శాస్త్రవేత్తగా అద్భుతాలు సృష్టించిన కలాం ఆ తర్వాత భారత దేశ అత్యున్నత పదవిని అలంకరించారు. 2002 జూలై 25న భారతదేశ 11వ రాష్ట్రపతి అయ్యారు. ఆయనను దేశ ప్రజలు ప్రేమగా 'ప్రజా రాష్ట్రపతి' అని పిలిచారు. ఎందుకంటే ఆయన పాఠశాల పిల్లల నుండి నిపుణుల వరకు ప్రతి ఒక్కరితోనూ స్నేహపూర్వకంగా కలిసేవారు.

**యువతపై అపారమైన ప్రభావం..**
రాష్ట్రపతి పదవి విరమణ తర్వాత 2001నవంబర్ నుండి అన్నా యూనివర్సిటీ, చెన్నైలో ప్రొఫెసర్, టెక్నాలజీ అండ్ సొసైటల్ ట్రాన్స్ ఫర్మేషన్‌గా అకడమిక్ బోధన, పరిశోధనల్లో నిమగ్నమయ్యారు. అన్నింటికంటే ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఉన్న హైస్కూల్ విద్యార్థులను కలుసుకుంటూ జాతీయ అభివృద్ధి కోసం యువతను ప్రేరేపించే లక్ష్యంతో పని చేశారు. 2020 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనేదే ఆయన ప్రధాన దృష్టి. యువత పెద్ద కలలు కనాలని, ఆవిష్కరణలు చేయాలని, దేశ నిర్మాణానికి కృషి చేయాలని ఆయన తీవ్రంగా ప్రోత్సహించారు. వైఫల్యం విజయానికి ఒక మెట్టు మాత్రమే అని, 'మండుతున్న మనస్సు' అపారమైన అవకాశాలను తెరవడానికి కీలకం అని ఆయన మనకు నేర్పారు.

**రచనలు..**
ఆయన రచించిన 'వింగ్స్ ఆఫ్ ఫైర్', 'ఇండియా 2020 ఏ విజన్ ఫర్ ది న్యూ మిలీనియం', 'మై జర్నీ', 'ఇగ్నైటెడ్ మైండ్స్ అన్‌లీషింగ్ ది పవర్ ఇన్ ఇండియా' వంటి విలువైన గ్రంథాలు అనేక భారతీయ భాషల్లోకి అనువదించబడ్డాయి.

**పురస్కారాలు - నిత్య స్మరణీయం..**
డాక్టర్ కలాం భారతదేశంలోని అత్యంత విశిష్ట శాస్త్రవేత్తలలో ఒకరు. ఆయన 30 విశ్వవిద్యాలయాలు, సంస్థల నుండి గౌరవడాక్టరేట్‌లను అందుకున్నారు. 1981లోపద్మ భూషణ్, 1990లో పద్మ విభూషణ్ వంటి పౌర పురస్కారాలతోపాటు, 1997లో భారతదేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' లభించాయి.

**యువతకు స్ఫూర్తి ప్రదాత..**
డాక్టర్ కలాం 2015 జూలై 27న షిల్లాంగ్‌లో తుది శ్వాస విడిచారు. ఆయన ఇక లేకపోయినా, ఆయన లక్షలాది మంది హృదయాలలో వెలిగించిన



నేడు ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి

జ్వాల ప్రకాశవంతంగా వెలుగుతూనే ఉంది. కలాం గారి 'భారతదేశం కోసం మూడు ఆశయాలు' స్వాతంత్ర్యం, అభివృద్ధి, బలం ఆయన వాటిని వివరించినప్పుడు ఎంతటి ప్రాముఖ్యత కలిగి ఉన్నాయో నేటికీ అంతే ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. నిరాడంబరమైన నేపథ్యం నుండి వచ్చి, శాస్త్రవేత్తగా దేశానికి సేవలందించి ప్రథమ పౌరులయ్యారు. ఆయన చూపిన మార్గం, ఆయన కలలు, ఆయన ఆశయాలు మనకు నిత్య స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ఆయన కలలను నిజం చేస్తూ, మరింత బలమైన, అభివృద్ధి చెందిన, ప్రబుద్ధమైన భారతదేశం వైపు పయనిద్దాం.

## భైంసాలో రాష్ట్రస్థాయి క్రీడలు

**ముథోల్, జూలై 26 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆగస్టు 5,6,7 తేదీల్లో రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు నిర్వ హించనున్నట్లు రాష్ట్ర ప్రాంత శైక్షనిక్ ప్రముఖ్ నల్లాని చక్రవర్తుల కృష్ణమాచార్యులు తెలిపారు. శనివారం పాఠశాలలో సన్నాహక సమావే శం నిర్వహించారు. పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన శిశుమందిరాల నుంచి 800 మంది క్రీడాకారులు హాజరవుతారన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత ఉపాధ్యాయులు, నిర్వాహకులకు సూచించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, చెస్, యోగా.. వంటి పది అంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. ప్రాంత ఖేల్‌కూద్ ప్రముఖ్ భీంసేన్ రావు, విభాగ్ శిక్షని ప్రముఖ్ కాళీ మహంతి వేణుమాధవ్, విభాగ్ ఉపాధ్య క్షుడు రమేశ్ మాశెట్టివార్, జిల్లా కార్యదర్శి గోపాల్కిషన్, పాఠశాలల ప్రబంధకారిణి సభ్యులు, పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్
## కేంద్ర బృందం పర్యటన

**మంచిర్యాల, జూలై 26 (ప్రభాత సమాచారం)**
స్వచ్ఛ సర్వేక్ష ణ్ గ్రామీణ్ - 2025 సర్వేలో భాగంగా కేంద్ర బృందం శనివారం హాజీపూర్ మండల కేంద్రంలో పర్యటించారు. తడి, పొడి చెత్త నిర్వహణపై గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. పం చాయతీ కార్యాలయంతోపాటు ప్రభుత్వ పాఠ శాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అందిస్తున్న సేవలు, కార్యకలాపాలపై తెలుసుకున్నారు. నర్సరీలు, నాటిన మొక్కల పెంపకం, నిర్వహణపై ఆరా తీశారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుం తల నిర్వహణ తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం అమలు తీరు, ప్రభుత్వ పథకాల అం దుతున్న తీరును ఆరా తీశారు. కేంద్ర బృందంలో అధికారులు నాగలక్ష్మి, రాజు ఉన్నారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

# జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

■ భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
■ *సాత్నాల, మత్తడి వాగు, పెన్‌గంగ, ఛనక ప్రాజెక్టుల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
■ గిరిజన ప్రాంతాల ప్రజలపై ప్రత్యేక దృష్టి సారించాలి ■ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్






**ఆదిలాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర అబ్కారీ కమిషనర్ సి. హరికిరణ్ గత మూడురోజులుగా ఏకధాటిగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర అబ్కారీ కమిషనర్ సి. హరికిరన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆయన జిల్లా కలెక్టర్ రాజర్షి షాతో కలిసి భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులు, యూరియా ఎరువుల నిల్వలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల ఎక్కడ కూడా ప్రాణనష్టం సంభవించకుండా, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా జిల్లాలో గల శివసాగర్ ప్రాజెక్ట్, కల్వర్టులు, వంతెనలు తదితర ఏరియాలలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. పరీవాహక ప్రాంతంతో పాటు కాలువలు, చెరువులు, ఇతర జలాశయాలలో చేపలు పట్టడానికి ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహా, ఆయా శాఖలు సన్నద్ధమై ఉండాలని, క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. వరద జలాలు ప్రవహించే ప్రాంతాల మీదుగా ప్రజలు రాకపోకలు సాగించకుండా నిషేధం విధించాలన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ఇటీవలే జిల్లాలో జలదిగ్బంధంలో చిక్కుకున్న సంఘటనలు నెలకొన్నాయని గుర్తు చేస్తూ, అలాంటి ప్రదేశాలకు ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరూ వెళ్లకుండా కట్టడి చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే, అవసరమైన పక్షంలో రాష్ట్రం నుండి సహాయక బృందాలు పంపించేలా చూస్తామని, స్థానిక పరిస్థితుల గురించి జిల్లా యంత్రాంగం ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ, భారీ వర్షాల వల్ల వరద పరిస్థితి నెలకొంటే సమర్థవంతంగా ఎదుర్కోవాలని అన్నారు. పురాతన, శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉంటున్న వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని , వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచే ప్రాంతాల పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని అన్నారు. ఎక్కడ కూడా చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా పరిస్థితులను పర్యవేక్షించాలని అన్నారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు, అతిసారం వంటివి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్ తో పాటు అగ్నిమాపక శాఖ, పోలీస్, మున్సిపల్ తదితర కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలో వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే ప్రజలు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 18004251939కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని సూచించారు. భారీ వర్షాల పరిస్థితి గురించి వాతావరణ శాఖ అందిస్తున్న సూచనలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేస్తున్నామని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్థానికులను తరలించేలా పునరావాస కేంద్రాలను కూడా గుర్తించి తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్‌లు, చెరువులలో వచ్చి చేరుతున్న వరద జలాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేస్తున్నామని అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రైనీ కలెక్టర్ సలోని, ప్రవంతి జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

**దండేపల్లి, జూలై 26 (ప్రభాత సమాచారం)**
మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడుదామని దండేపల్లి మండల కేంద్రంలోని జెడ్పి ప్రభుత్వ పాఠశాల హెచ్ ఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలను పంపించేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో అందరూ కలిసి మొక్కలు నాటారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని శ్రీనివాస్ సూచించారు.

## మంత్రి పీఏపై బీఆర్ఎస్ నాయకుల విమర్శలు అర్థరహితం

### కాంగ్రెస్ నాయకులు రాజేష్ కుమార్

**మందమర్రి, జూలై 26 (ప్రభాత సమాచారం)**



రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి పీఏ రమణరావుపై బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు అర్థరహితం అని అసత్య ప్రచారాన్ని బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు, దళిత రత్న తుంగపిండి రాజేష్ కుమార్ హితవు పలికారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మంత్రి పీఏ పై బీఆర్ఎస్ నాయకులు నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజల్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. పీఏ రమణరావు తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని, ప్రజలకు సేవ చేయడంలో మంత్రి వివేక్ చూపుతున్న నిబద్ధతను వ్యతిరేకించలేక, ప్రతిపక్ష నాయకులు వ్యక్తిగత దూషణలతో దాడికి పాల్పడుతున్నారని విరుచుకుపడ్డారు. మంత్రి పీఏ పై దుష్ప్రచారం చేయడం బాధాకరమని బీఆర్ఎస్ నాయకుల దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# సైబర్ నేరాల నియంత్రణలో అప్రమత్తతే ఆయుధం



**ఆదిలాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)**
రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరా లను నియంత్రించేందుకు పోలీసు ప్రత్యే క బృందాలు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా సమాజంలోని ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం పోలీసు ప్రధాన కార్యాలయం నుండి మీడియాకు ప్రకటన విడుదల చేస్తూ ఈవారం రోజుల్లోనే సైబర్ క్రైం బృందానికి 14 ఫిర్యాదులు అందాయని, సునాయాసంగా అత్యాశతో అధిక డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో సైబర్ క్రైం నేరగాళ్లు మధ్యవర్తులను ఉచ్చులోకి దించి డబ్బును కాజేస్తున్నారని ఎస్పీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి తమ డబ్బు కోల్పోకుండా ఉండాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో నూతన సైబర్ క్రైం పద్ధతుల్లో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, క్రెడిట్ కార్డు డెబిట్ కార్డు ఫ్రాడ్, సోషల్ మీడియా ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్ లాంటివి జరుగుతున్నాయని వాటి వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచి ంచారు. ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీ స్ స్టేషన్ లోని పరిధిలో సిబిఐ అధికా రులు అంటూ ఫోన్ ద్వారా బెదిరించి బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు పంపక పోతే కేసు నమోదు చేస్తామని బెదిరించగా న17వేల రూపాయలను పంపి మోసపోవడం జరిగిందనిఅన్నారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక బాధితునికిలోన్ ద్వారా 50 వేల రూపాయలను అందజేస్తామని వివరాలన్నీ సేకరించి అతని వద్ద నుండి 20 వేల రూపాయలను తస్కరించడం జరిగిందని అన్నారు. ఇచ్చోడ మండలంలోని ఒక బాధితుడు ఇంస్టాగ్రామ్ నందు భారత్ ఫర్టిలైజర్ అనే లింక్ ని ఓపెన్ చేసి బిజినెస్ ద్వారా అధిక డబ్బులు తక్కువ సమయంలో సంపాదించగలమని చెప్పిన సైబర్ నేర గాళ్ల మాటలు నమ్మి విడతల వారీగా దాదాపు 3 లక్షల రూపాయలను వారికి అప్పగించడం జరిగిందని తెలిపారు. బోథ్మండలంలోని ఒక బాధితునికి హెచ్డిఎఫ్సి క్రెడిట్ కార్డు లిమిట్ పెంపొందించుతామని చెప్పి ఫోన్ చేసి బాధితుని వివరాలు తీసుకొని రూ.42 వేలు తస్కరించడం జరిగిందన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి సాధ్యమైనంత వరకు డబ్బులను సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**కాగజ్‌నగర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, రుచికరమైన ఆహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్‌లోని పెట్రోల్ పంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆగ్రోస్ ఫర్టిలైజర్స్, జడ్పీ పాఠశాలను సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి శనివారం సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తాగునీటి కుళాయిలు, తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, వంటశాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం ఎల్లాగౌడ్ తోటలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలించారు. ఇన్ పేషెంట్, ఔట్ పేషంట్ సేవలు, మందుల అందుబాటు వివరాలు ఆరా తీశారు. మార్కెట్‌లోని మన ఆగ్రోస్ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. స్టే మందులు, ధరలు, స్టాకు రిజిస్టర్, రసీదు పుస్తకాలు, తదితర వివరాలను పరిశీలించారు. యూరియా కొరత లేకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమంలో కాగజ్‌నగర్ తహసీల్దార్ మధుకర్, ఏడీఏ మనోహర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కేశవరావు, ఎంఈఓ ప్రభాకర్, వైద్యులు పాల్గొన్నారు.





## పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**లక్షెట్టిపేట, జూలై 26 (ప్రభాత సమాచారం)**
పేదల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని లక్షెట్టిపేట మండలంలోని పాత కొమ్ముగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సత్యం అన్నారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శితో కలిసి ఆయన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అప్పుకింద బైక్ తీసుకెళ్లిన వ్యక్తిపై తండ్రీ కొడుకుల దాడి

**బెల్లంపల్లి, జూలై 26 (ప్రభాత సమాచారం)**
ఇచ్చిన అప్పును తీర్చమన్నందుకు ఓ వ్యక్తిపై బకాయి పడ్డ వ్యక్తి దాడి చేసి గాయపరిచిన సంఘటన మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలో శనివారం చోటుచేసుకుంది. కాసిపేట ఎస్ హెచ్ ఓ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్ర కారం.. కొమటిచేను గ్రామానికి చెందిన రామటెంకీ శివరాం, అదే గ్రామానికి చెందిన జాడి రవికి అప్పుగా కొంత నగదును ఇచ్చాడు. అప్పు చెల్లింపులో జాప్యంకావడంతో డబ్బుల గురించి గట్టిగానే అడిగాడు. ఇంతకీ అప్పు చెల్లించకపోయే పోవడంతో విసిగిపోయిన శివరాం, అప్పు కింద జాడి రవి కి చెందిన బైక్ ను గత రెండు రోజుల క్రితం గొడవపడి తీసుకెళ్ళాడు. దీన్నిఅవమానకరంగా భావించి కోపం పెంచుకున్న జాడిరవి అతని కొడుకు జాడి అరవింద్ ఇద్దరూ రామటంకి శివరాంపై కత్తితో దాడి చేశారు. సంఘటనలో రామటెంకి శివరాంకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ వెల్లడించారు.





## కడెం ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

**కడెం, జూలై 26 (ప్రభాత సమాచారం)**

కడెం ప్రాజెక్టులో 2 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 700 అడుగులు కాగా, శనివారం సాయంత్రం 5 గంటలకు ప్రాజెక్టులో 695 అడుగుల నీటిమట్టం ఉందని తెలిపారు. ఎగువ ప్రాంతాల నుండి ప్రాజెక్టులోకి 10,400 క్యూసెక్కుల వద్ద నీరు వస్తోంది. దీంతో ఎడమ కాలువకు 755, భగీరథకు 9, దిగువకు 96272 మొత్తం కలిపి 10,138క్యూసెక్కుల నీటినివిడుదల చేస్తున్నామన్నారు.

## ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



**కాసిపేట, జూలై 26 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని పలు గ్రామాల్లోని ఎరువుల షాపులను శనివారం టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. టాస్క్ ఫోర్స్ కమిటీ అధికారులు ఏవో చల్ల ప్రభాకర్, ఎస్సై ఆంజనేయులు, దేవాపూర్ ఎస్సై గంగారాం, తదితరులు ముత్యంపల్లి, కాసిపేట, కోమటిచేను, దేవాపూర్ గ్రామాల్లోని ఎరువుల షాపులను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్, రసీదులను తనిఖీ చేశారు. స్టాక్ బోర్డ్ ఏర్పాటు చేసి స్టాక్ వివరాలు, ధరల వివరాలు పెట్టాలని సూచించారు. అధిక ధరలు అమ్మవద్దని, ఎరువులను బ్లాక్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కస్తూర్బాలో స్పాట్ అడ్మిషన్స్

**మంచిర్యాల, జూలై 26 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ స్వీకరిస్తున్నట్లు కళాశాల ఎస్ఓ మౌనిక శనివారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో పది, ఆరవ తరగతిలో ఖాళీగా ఉన్న పది సీట్లలో చేరేందుకు అర్హులైన విద్యార్థినిలు ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్ల రూపంలో పొందవచ్చునని వెల్లడించారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీలు ఉపయోగించుకోవాలని కోరారు.

## జీవో 49కు వ్యతిరేకంగా తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయండి

**బెజ్జూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం జిల్లా, బెజ్జూర్ మండల కేంద్రంలో శనివారం ఆదివాసి భవనం నందు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ మండల అధ్యక్షులు కోరెత తిరుపతి మాట్లాడుతూ జీవో నెంబర్ 49ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు ఈనెల 28న కొమురం భీం, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని వారు కోరారు. 9 తెగల ఆదివాసీ ప్రజలు, నాయకులు అందరుకూడ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని అన్నారు.

# సొంత రాజకీయాల కోసం ఆదివాసీలను బలి చేయొద్దు

**నార్నూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

కొంత మంది తమ స్వార్థ రాజకీయాల కోసం ఆదివాసీలను బలి చేస్తున్నారని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు ఆరోపించారు. మాజీ ఎంపీకి వ్యతిరేకంగా శనివారం నార్నూర్ మండల కేంద్రంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ సమాజంలో ఒక మాతృ సంఘంగా తుడుం దెబ్బ కొనసాగుతు వస్తుందని వెల్లడించారు. తుడుందెబ్బ కారణంగానే ఎమ్మెల్యేగా, ఎంపీగా సోయం బాపురావు గెలిచిన విషయాన్ని మరిచిపోయారని పేర్కొన్నారు. తుడుందెబ్బకు వ్యతిరేకంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ సమాజ సంఘాలను సర్వ నాశనం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఊసరవెల్లిలో పార్టీలు మారుస్తూ ప్రజల్లో విశ్వాసం కోల్పోయి మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. సోయం బాపూరావును కాంగ్రెస్ నుంచి బర్తరఫ్ చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు పెందోర్ దాదిరావు , జిల్లా ఉపాధ్యక్షులు మెస్రం మానిక్ రావు, నార్నూర్ మండల అధ్యక్షులు ఆడ శ్రీరం



, కార్యనిర్వాహణ అధ్యక్షులు మాడవి సాగర్ , ఉపాధ్యక్షులు ఆత్రం పరమేశ్వర్, ప్రచార కార్యదర్శి మెస్రం మోతిరాం నాయకులు మాడవి ఆనంద్ రావు యేత్మారావు, కుమ్ర చాతృరా, జుజ్జాక భీంరావ్, కొట్నాక శ్రీరామ్, ఆత్రం రామేశ్వర్, మెస్రం జంగు, కొడప మహేష్ ,మెస్రం జగజీవన్,మెస్రం నగేష్ , మెస్రం శేఖర్ , కొట్నాక జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# 4 నుంచి జైనూర్‌లో రేషన్ కార్డుల పంపిణీ

### జైనూర్ తహసీల్దార్ బీర్‌షావ్



**జైనూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

ఆగస్టు 4 నుంచి నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు జైనూర్ తహసీల్దార్ బీర్ షావ్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 4న మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతన రేషన్ కార్డులతో పాటు, పాత రేషన్ కార్డ్ లలో పేర్లు యాడ్ చేసినవి రేషన్ కార్డులు పంపిణీ చేస్తునట్లు తెలిపారు. ఆగస్ట్ 4న ప్రజలు అందుబాటులో ఉండి రేషన్ కార్డ్‌లు తీసుకోవాలని ఆయన కోరారు.

# ఆరోగ్యం పట్ల విద్యార్థులు జాగ్రత్త తీసుకోవాలి



**నార్నూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

గాదిగూడ మండలంలోని అర్జునీ ఆశ్రమ బాలికల పాఠశాలను, కొలంగూడ శాటిలైట్ సెంటర్‌ను జీసీడీవో మెస్రం ఛాయ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశమై ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాలు, వంటగది శుభ్రంగా ఉంచాలని, వంట సామగ్రి, కూరగాయలు శుభ్రంగా కడిగి వంటచేయాలని సూచించారు, అనంతరం విద్యార్థుల ఆరోగ్య రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు పరిశీలిస్తూ ఉండాలని ఏఎన్ఎంకు ఆదేశించారు. సిక్‌రూంను, మందులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఎలక్షన్ నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట పవార్ శ్యామ్, అశోక్ ఉన్నారు.

# ఇష్టరాజ్యంగా పనులు.. రైతులకు తప్పని ఇబ్బందులు



**తాండూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి నుంచి తాండూర్ మండలం అచ్చులాపూర్ వరకు మూడేళ్ల క్రితం మంజూరైన రోడ్డును గత సంవత్సరం ప్రారంభించారు. ఇందులో భాగంగా రోడ్డు పనులు చేపట్టకుండా కేవలం అచ్చులాపూర్ వద్ద ఒక కల్వర్టు మాత్రమే నిర్మించారు. ఈ కల్వర్టు పనులు కూడా ఇష్టారాజ్యంగా చేయడంతో ఇప్పుడు అసలు పంటల సీజన్‌లో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు నిర్మాణం కోసం తోడిన మట్టిని కల్వర్టు లోనే వేయడంతో వరద కాలువ మూసుకుపోయింది. దీంతో నీళ్లు వెనక పొలాల్లోకి వెళ్తున్నాయి. పైన కూడా గట్టి మొరం వేయకుండా తీసిన మట్టితోనే నింపడంతో మోకాళ్ల లోతు బురద తయారైంది. పక్కనున్న పొలాల గట్లు కూడా తీసి మళ్లీ పునరుద్ధరించక పోవడంతో రైతులే మళ్లీ సొంత ఖర్చులతో పనులు చేయించుకుంటున్నారు.



## మనసును తాకే సాలేగూడ వాటర్ ఫాల్స్

**కాసిపేట, జూలై 26 (ప్రభాత సమాచారం)**

తెలంగాణలో ప్రకృతి అందాలకు కొదువే లేదు. అంతరంగ, పల్లగట్టు, కుంటాల, బొడకుండ, బోగత తదితర జలపాతాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. వర్షకాలం వచ్చిందంటే ఈ ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి మొదలవుతుంది. అదేతరహాలో మంచిర్యాల జిల్లాలోని కాసిపేట మండలం సాలేగూడ వాటర్ ఫాల్స్ అందాలు అదర్స్ అనిపిస్తున్నాయి. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన సాలేగూడ జలపాతం కురుస్తున్న వర్షాలకు పరవళ్లు తొక్కుతుంది. చుట్టూ కొండలు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆదివాసీ పల్లె దగ్గరలో ప్రకృతి సోయగాల నడుమ ఉన్న వాటర్ ఫాల్స్ ప్రకృతి ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. పర్యాటకులు అక్కడి వచ్చి ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. కాసిపేట మండలం గట్రావ్ పల్లి పంచాయతీలోని సాలేగూడ గ్రామం నుంచి సుమారు 2 కిలో మీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో ఈ వాటర్ ఫాల్స్ కనువిందు చేస్తున్నాయి.

## రోడ్డుపై పడిపోయిన భారీ చెట్టు

**జన్నారం, జూలై 26 (ప్రభాత సమాచారం)**

మండలంలోని టీజీపల్లి శివారులో ఉన్న ప్రధాన రహదారిపై పెద్ద చెట్టు పడిపోవడంతో ఆ మార్గంలో వాహనాలరాకపోకలు నిలిచిపోయాయి. శనివారం మండలంలో మోస్తారు నుంచి భారీ వర్షం పడుతుంది. దీంతో మండలంలోని టీజీపల్లి-మొర్రిగూడ గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిపై భారీ వేప చెట్టు పడిపోయింది. ఆ మార్గంలో వాహనాల రాకపో కలకు అంతరాయం ఏర్పడింది. చెట్టును స్థానికులు తొలగించారు.





# ఊబకాయంతో యమా డేంజర్

## భవిష్యత్ ప్రమాద ఘంటికలు

ప్రభాత సమాచారం, హెల్త్ డెస్క్

ఊబకాయం : ప్రస్తుతం అతిపెద్ద సమస్యగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా ఊబకాయుల సంఖ్య పెరుగుతోంది. దీంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అయితే ఇందుకు వైద్యులు ఆనేక కారణాలు చెబుతున్నారు. భారత దేశంలో 2050 నాటికి భారతదేశంలో అధిక బరువుగల వారి సంఖ్య ఏకంగా 45 కోట్లకు చేరే అవకాశం ఉంది. ఈ సమస్య 15%-%24 ఏళ్ల యువతలోనూ, 5%-%14 ఏళ్ల పిల్లల్లోనూ వేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం చైనా, అమెరికా తర్వాత భారత్ ఊబకాయ సమస్యలో మూడో స్థానంలో ఉంది. 2021 గణాంకాల ప్రకారం దేశంలో 17.6 కోట్ల మంది అధిక బరువుతో ఉన్నారు. రాబోయే కొన్నేళ్లలో అమెరికాను అధిగమించి, ప్రపంచంలో ఊబకాయుల సంఖ్యలో భారత్ రెండో స్థానంలో నిలిచే అవకాశం ఉందని లాన్సెట్ జర్నల్ తెలిపింది.

**తెలుగు రాష్ట్రాల్లోలనూ..**

తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సమస్య వేగంగా విస్తరిస్తోంది. హైదరాబాద్ (Hyderabad)లోని ఐటీ ఉద్యోగుల్లో ఎక్కువ మంది స్థూలకాయంతో బాధపడుతున్నట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిస్థితి మన దగ్గర ప్రమాద సంకేతాలు మోగిస్తోందని అర్థం చేసుకోవాలి. జీవన శైలి, వ్యాయామం లేకపోవడం, వేళాపాల లేకుండా తినడం వంటి కారణాలు ఊబకాయానికి కారణం అంటున్నారు.

**ఆహారంలో జాగ్రత్తలు - మైండ్‌ఫుల్ ఈటింగ్ కీలకం**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఊబకాయానికి ప్రధాన పరిష్కారం 'మైండ్‌ఫుల్ ఈటింగ్'. దీని కోసం కొన్ని సూత్రాలు పాటించాలి. ఆకలి వేసినప్పుడు మాత్రమే తినాలి. సమయం అయిందని అనవసరంగా ఆహారం తీసుకోవడం బరువు పెరగడానికి దారితీస్తుంది. ఒంటరితనం, బాధ లేదా కాలక్షేపం కోసం అతిగా తినడం మానాలి. భోజన సమయంలో టీవీ, మొబైల్ వంటి పరధ్యానాలు లేకుండా, ఏం తింటున్నామో, ఎంత తింటున్నామో శ్రద్ధగా గమనించాలి. ఆహారం రుచిని ఆస్వాదిస్తూ నెమ్మదిగా తినాలి. క్యాలరీలపై అవగాహన ఉంచాలి. ఒక పూట ఎక్కువ తీసుకుంటే, తర్వాతి పూట తగ్గించాలి. సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన జీవనశైలి, తగిన నిద్ర, ఒత్తిడి నియంత్రణ వంటివి ఊబకాయాన్ని అరికట్టడంలో సహాయపడతాయి.

**యువత, పిల్లల్లో ఊబకాయం..**

'వరల్డ్ ఒబేసిటీ ఫెడరేషన్' ప్రకారం, ప్రాసెస్డ్ మరియు ప్యాక్ చేసిన ఆహారాలు యువత, పిల్లల్లో ఊబకాయానికి ప్రధాన కారణం. అదనంగా, మొబైల్ ఫోన్లు, టీవీలకు అతిగా అలవాటు పడడం, ఆటస్థలాల్లో శారీరక ఆటలు తగ్గిపోవడం కూడా ఈ సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి.

### ఊబకాయం అంటే ఏమిటి?

శరీరంలో కొవ్వు అధికంగా పేరుకుపోతే దాన్ని ఊబకాయం అంటారు. దీన్ని బాడీ మాస్ ఇండెక్స్ ద్వారా కొలుస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం..

- 18.5 కన్నా తక్కువ: తక్కువ బరువు
- 18.5-24.9: సాధారణ బరువు
- 25-29.9: అధిక బరువు
- 30 కన్నా ఎక్కువ: ఊబకాయం

### ఊబకాయానికి కారణాలు

- జన్యుపరమైన అంశాలు
- అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు
- శారీరక శ్రమ లేకపోవడం
- వాతావరణ కారణాలు
- కొన్ని ఔషధాల వాడకం

ఊబకాయం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు

అధిక బరువు ఉన్నవారికి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉంది :

- టైప్-2 మధుమేహం
- అధిక రక్తపోటు
- గుండె జబ్బులు - ఫ్యాటీ లివర్
- మానసిక ఆరోగ్య సమస్యలు
- మహిళల్లో గర్భధారణ సమస్యలు



## సమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతి

**నెన్నెల, జూలై 26 (ప్రభాత సమాచారం)**



మండల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీష్ గౌడ్ హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ప్రజలు గత 30సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూములను ఫారెస్ట్ అధికారులు అడ్డకొని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. అర్హులైన రైతులకు పట్టాలు ఇప్పిం చాలని కోరారు. అటవీ అనుమతులు లేక నిలిచిపోయిన రోడ్డు పనులు ప్రారంభించాలన్నారు. నెన్నెల టీ రోడ్డు నుంచి ఎల్లమ్మ గుడి వెళ్లే మార్గంలో కుమ్మ రివాగుపై బ్రిడ్జి నిర్మించాలని సీఎం దృష్టికి తీసుకె ళ్లారు. నెన్నెల కుమ్మరివాగు బ్రిడ్జి శిథిలావస్థలో ఉన్నందునా, నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. నెన్నెల నుంచి ఆవుడం గ్రామానికి డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలన్నారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ పోడు భూముల పట్టాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామన్నారు. మండలా భివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చినట్లు హరీష్ గౌడ్ చెప్పారు.

## విధుల్లో చేరిన ముగ్గురు రిమ్స్ ప్రొఫెసర్లు

**ఆదిలాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)**



ఇటీవల ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందిన ముగ్గురు వైద్యులు శనివారం రిమ్స్ ఆసుపత్రిలో విధుల్లో చేరారు. జనరల్ సర్జన్ ప్రొఫెసర్ అశోక్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ తానాజీ జాడే, పీడియాట్రిక్ ప్రొ ఫెసర్ ఎస్.కవిత ఉదయం డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి రిపోర్టు చేశారు. తొమ్మిది మందిని రిమ్స్‌కు కేటాయించగా ముగ్గురు విధుల్లో చేరారు. మరో ఆరుగురు చేరాల్సి ఉంది.

## దేశీదారు తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

**భీంపూర్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

మహారాష్ట్ర కనికి నుంచి మండలం లోని పాకిగూడ గ్రామానికి అక్రమంగా దేశీదారును తరలిస్తున్న ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు జైనథ్ సీఐ డి. సాయినాథ్, ఎస్సై పీర్సింగ్ నాయక్ తెలిపారు. తొడ్సం వెంకట్రావు, ఆత్రం మోతీరామ్ బైక్పై దేశీదా రు తీసుకువస్తున్నారని పక్కా సమాచారంతో లింగూడ గ్రామ శివారులో అదుపులో తీసుకు ని వారి వద్ద మంచి 50 దేశీదారు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బైక్ సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. చాకచ క్యంగా ఇద్దరిని పట్టుకున్న సీఐ, ఎస్సై తోపాటు హెడ్ కానిస్టేబుల్ గంగారెడ్డి, మధు కరు డీఎస్పీ జీవన్ రెడ్డి అభినందించారు.











# అర్హులందరికీ రేషన్ కార్డులు

- లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ
- అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు వస్తాయి
- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ప్రతిపక్షల అసత్య ప్రచారం నమ్మవద్దు
- అర్హులైన వారికి అందిరికి ప్రభుత్వ పథకాలు
- రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**కడెం, జూలై 26 (ప్రభాత సమాచారం)**

అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్‌కార్డు మంజూరు అవుతుందని ఖానాపూర్ ఎమ్మెలే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం కడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి హరికిరణ్‌తో కలిసి కలెక్టర్ అభిలాష అభినవ్ అర్హులైన లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని గత ప్రభుత్వంలో రేషన్ కార్డులు మంజూరు చేయడంతో చాలా జాప్యం జరి గిందని కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఒక్కొక్క టిగా ప్రతీ పథకం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తామన్నారు. ఈకార్డుతో ఒక్కొక్కరికి నెలకు 6కిలోల సన్న బియ్యం అందజేస్తామని లబ్ధిదారులు తీసుకోవాలన్నారు. ప్రతీ సంక్షేమ పథకం నేరుగా అందు తుందని ఎక్కడా ఒక్క పైసా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. 10 సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న కొత్త రేషన్ కార్డుల కల ఈ రోజు నెరవేరిందని, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి ఎన్నో ప్రతిష్టాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని, వీటన్నిటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా ప్రజలకు నూతన రేషన్ కార్డులు లేక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కున్నారని చెప్పారు. ఖానాపూర్ నియోజకవర్గంలో దాదాపు 20 వేల కుటుంబాలకు లబ్దిచేకూరిందని తెలిపారు. ప్రజలకు నూతన రేషన్ కార్డులు అందించడం ద్వారా ప్రభుత్వం అందించు అన్ని పథకాల ఫలాలు పొందుతారని అన్నారు. నూతనంగా రేషన్ కార్డులు పంపిణీ చేయడంతో మరింత మంది ప్రజలు ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, వంటగ్యాస్ సబ్సిడీ, వంటి ఎన్నో పథకాలను అదనంగా పొందుతారని అన్నారు. పేద ప్రజలందరూ పస్తులు ఉండకుండా నాణ్యమైన ఆహారాన్ని మూడు పూటలా కడుపునిండా తినాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అన్నింటికి రేషన్ కార్డులే ప్రామాణికం అని, గత కొద్ది రోజులుగా నూతన రేషన్ కార్డులు అందకపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ కార్డుల ద్వారా ప్రజలందరికీ ఆరు కిలోల చొప్పున రేషన్ దుకాణాల ద్వారా ఉచిత సన్న బియ్యం అందుతాయని చెప్పారు. కడెం మండలంలో 966 నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయని అన్నారు. 2 వేలకు పైగా రేషన్ కార్డులలో పేర్లు చేర్చడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ సాంస్కృతిక సారధి కళాజాత బృందాలు ప్రభుత్వ పథకాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, తదితర అంశాలపై అవగాహన కలిగేలా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మెన్ పడిగెల భూమన్న భూషణ్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, రేషన్ కార్డుల లబ్ధిదారులు, రేషన్ డీలర్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# వర్షాకాలం ముందస్తు చర్యలు తీసుకోవాలి

- అన్ని శాఖల అధికారలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- నిర్మల్ జిల్లా అధికారులతో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి హరికిరణ్ సమీక్ష

**నిర్మల్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక అధికారి హరి



కిరణ్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, ఆరోగ్య, అగ్నిమాపక, విద్యుత్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ,జిల్లాలో లోతట్టు ప్రాంతాలను గుర్తించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. మ్యాన్‌హెూల్స్, డ్రైన్లు, చెరువులు, ప్రాజెక్టుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. వర్షాకాలంలో చెరువుల వద్ద చేపల వేటకు ప్రజలు వెళ్లకుండా అవగాహన కల్పించాలని అన్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు హెచ్చరికలు ఇవ్వాలని, ఆడియో ద్వారా గ్రామాల్లో ప్రచారం చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. ఎరువుల వినియోగంపై పర్యవేక్షణ ఉండాలని, యూరియాను వ్యవసాయానికి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రేషన్ కార్డుల పంపిణీ ప్రజాప్రతినిధుల సమన్వయంతో షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 24/7 కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, మీడియా ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY




## ఆ గ్రామంలో బిక్షాటన, బిజినెస్‌కు

# ప్రత్యేక టైమింగ్స్ బోర్డు

## వినూత్నంగా ఆలోచించిన దేశంలోనే మొదటి పల్లె

**ముథోల్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

సహజంగా బస్టాండ్‌లు, ప్రయాణ ప్రాంగణాలు, గుళ్లు, కార్యాలయాలు వంటి ప్రాంతాల్లో గమనిక బోర్డులు కనిపించడం మనం చూస్తుంటాం. అయితే, దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ఇందుకు భిన్నంగా ఒక వెరైటీ గమనిక బోర్డును బైంసా మండలం వాలేగాం గ్రామంలో ఏర్పాటు చేశారు. వివరాల్లోకెళితే నిర్మల్ జిల్లా బైంసా మండలం వాలేగాం గ్రామ తోరణం వద్ద గ్రామస్తులు, వీడీసీ సభ్యులు కలిసి ఈ ప్రత్యేకమైన బోర్డును పెట్టారు. రాత్రి కాకుండా పట్టపగలు కూడా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ఆలోచనకు రూపకల్పన చేశారు. ఇంతకీ ఈ బోర్డులో ఏముంది అంటే చిరు వ్యాపారులు, భిక్షాటన చేసేవారు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు మాత్రమే గ్రామంలోకి రావాలని సూచించారు. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే రూ.500 జరిమానా విధిస్తామని కూడా బోర్డులో పేర్కొన్నారు.

## ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో

# భారీ నుంచి అతి భారీ వర్షాలు

**ఆదిలాబాద్, జూలై 26 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో వర్షాలు దంచికొడుతున్నాయి శనివారం ఉదయం నుంచి హైదరాబాద్‌లో ఎడతెరపి లేకుండా వాన కురుస్తున్నది. ఇక ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు రెండు జిల్లాలకు ఆరెంజ్ అలర్జ్ జారీచేసింది. అదేవిధంగా నిర్మల్, మంచిర్యాల, జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. దీంతో ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.